


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



20
రంగారెడ్డి
శనివారం 12 ఆగస్టు 2017

యువతే.. దేశ భవిత

నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

యువతే దేశానికి భవిత.. యువ శక్తి తలుచుకుంటే సాధించనిది ఏదీ లేదు. పల్లె నుంచి ప్రపంచ దేశాల వరకు యువతే ప్రధాన వనరు. సమస్యలపై గలమెత్తాలన్నా.. అవినీతిపై పిడికిలి బిగించాలన్నా.. ఉద్యమాలు చేయాలన్నా.. యువతే ముందుంటుంది. సేవ, రాజకీయాలు, విద్య, ఉద్యోగ రంగాల్లో యువతదే కీలక పాత్ర. ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో ప్రభుత్వాల పనితీరును సైతం యువత ప్రభావితం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. సమసమాజ నిర్మాణంలో యువత బాధ్యత, గొప్పతనాన్ని ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు12న అంతర్జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

- వివరాలు 11లో..

భూముల రీసర్వేకు..
నేడే శ్రీకారం

87 ఏళ్ల తరువాత రాష్ట్రంలో తొలిసారిగా భూముల రీసర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూముల సమగ్ర సర్వేతోపాటు రెవెన్యూ రికార్డుల్లో సవరణలు చేయడానికి సిద్ధమైంది. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పక్కాగా రికార్డులు రూపొందించేందుకు సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం పైలెట్ ప్రాజెక్టుగా ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ, చింతపల్లి గ్రామాలను ఎంపిక చేసింది. ఈ రెండు గ్రామాల్లో సమగ్ర భూసర్వే కార్యక్రమానికి నేడు శ్రీకారం చుట్టనుంది. దీని ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా భూముల రీసర్వే ప్రక్రియ చేపట్టనుంది. రెవెన్యూ వ్యవహారాల్లో అపార అనుభవం ఉన్న కలెక్టర్ రఘునందన్‌రావు, జేసీ సుందర్ అబ్నార్‌లకు సర్కార్ కీలక బాధ్యతలు అప్పగించింది. - వివరాలు 7లో

- పైలెట్ ప్రాజెక్టుగా రంగారెడ్డిజిల్లా ఎంపిక
- 87 ఏళ్ల తరువాత జరుగుతున్న భూముల సమగ్ర సర్వే
- ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ, చింతపల్లిలో ప్రారంభం
- అధునాతన పరికరాలతో కచ్చితంగా భూకొలతలు
- నాలుగు రోజుల్లో ఈ రెండు గ్రామాల్లో సర్వే పూర్తి
- రైతులంతా అందుబాటులో ఉండాలని అధికారుల ఆదేశం
- కమిటీలో కలెక్టర్, జేసీలకు చోటు



పరిశ్రమల్లో దోపిడీ చేసిన
ఆరుగురి అరెస్టు

రూ.8 లక్షలు విలువైన 310 బ్యాటరీలు, 186 సీసం రాడ్లు, 4 వాహనాలు, కత్తి, 2 బొమ్మ పిస్తోళ్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ వెంకటేశ్వర్‌రావు

3 లో



గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ..

- ఆమనగల్లు పాఠశాలల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- గోపిక, కృష్ణుల వేషధారణల్లో ఆకట్టుకున్న చిన్నారులు
- పాఠశాలల్లో ఉట్ల కార్యక్రమం

వివరాలు 20లో..

శిథిలదశలో ఫిరంగి కాలువ

- అధికారుల పర్యవేక్షణ లోపం.. పాలకుల నిర్లక్ష్యంతో ఆక్రమణలకు గురవుతున్న కాలువ
- మరమ్మతులు చేపట్టాలని స్థానికుల వేడుకోలు



ఈసీవాగుపై నిర్మించిన కత్వ ఇదే..

7 లో

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అభివృద్ధి పనులపై
సమీక్షలు

● మండలాల వారీగా సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు
● 17 నుంచి 19 వరకు నిర్వహణ
● డీపీవో సురేష్‌మోహన్, మేడ్చల్ జిల్లా



కీసర రూరల్ : జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. గ్రామాల వారీగా ప్రణాళికలు రూపొందిస్తోంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు సమన్వయపరిచేందుకు ప్రత్యేక అధికారులను నియమించింది. కొత్తగా ఏఏ పనులు చేపట్టాలన్న దానిపై సంబంధిత అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. జిల్లాలో అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై జిల్లా పంచాయతీశాఖ అధికారి వి.సురేష్‌మోహన్ 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రభుత్వం గొర్రెల పంపిణీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ద్వారా పలు ఉపాధి హామీ పథకాలు అమలు చేస్తున్నారు. ఈ పథకాలన్నీ సమగ్రంగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా పథకాలపై క్షేత్రస్థాయిలో చర్చ జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయిలో సమీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. జిల్లా కలెక్టర్ ఎం.వీ.రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి 19 వరకు అభివృద్ధిపై సమీక్షా సమావేశాలు నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాం. ఈమేరకు సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశాం. ఆగస్టు 17వ తేదీన శామీర్‌పేట, మేడ్చల్, 18న ఘట్‌కేసర్, కీసర, 19న కుత్బుల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ సమీక్షా సమావేశాల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, స్వచ్ఛభారత్ మిషన్, బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలు ప్రకటించుట, హరితహారం, డంపింగ్ యార్డు అభివృద్ధి పనులు, వైకుంఠధామం అభివృద్ధి పనులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఉన్నతాధికారులతో కలిసి జిల్లాలోని శామీర్‌పేట్ మండలంలోని కేశవరం, లక్ష్మాపూర్, మూడుచింతలపల్లి గ్రామాల్లో పర్యటించి, గ్రామ సభలు నిర్వహించారు. మూడు గ్రామాలకు దాదాపు రూ.60 కోట్ల మేరకు అభివృద్ధి పనులకు హామీలు ఇచ్చారు. అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలపై ప్రతిపాదలు రూపొందించ నున్నాం. ఈ సమావేశాలకు హాజరయ్యే మండల స్థాయి అధికారులు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ హరిత అధికారులు, స్వచ్ఛతాగ్రాహీలు పూర్తి వివరాలతో హాజరుకావాలి. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నాం. మండల కేంద్రాల్లో నిర్వహించనున్న ఈ సమావేశాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు హాజరయ్యే విధంగా సూచించాం.

కళ్లుపోతున్నాయ్...

● పెరిగిన ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం
● కంటి చూపుపై తీవ్ర ప్రభావం
● యువతలో అధికమవుతున్న కంటి సమస్యలు

పెద్దేముల్ : ఆధునిక కాలంలో ఎలక్ట్రానిక్ పరికరాల రాకతో జీవనశైలి మారుతోంది. కంప్యూటర్స్, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల రాకతో వీటిపై చిన్నారులు, యువత ఎక్కువగా ఆధారపడుతున్నారు. దాంతో ఎక్కువ మంది నిద్రలేమితో బాధపడుతున్నారు. స్థూలకాయులుగా మారుతున్నారు. దృష్టి సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై ఎక్కువగా ఆధారపడే కొద్దీ అనారోగ్య సమస్యలు అంతే స్థాయిలో పెరుగుతున్నాయని పలు సర్వేలు తేల్చి చెబుతున్నాయి. పిల్లలు అడిగిందే తడువుగా స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లను పెద్దలు కొనిస్తున్నారు. వారు వీటిని ఎలా వినియోగిస్తున్నారనే దానిపై నిఘా ఉంచడం లేదు. దీంతో రాత్రి పూట నిద్ర లేకుండా ఎక్కువ సమయం గడిపే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌ల తెరల నుంచి వెలువడే నీలిరంగు కాంతినే కాకుండా అధికశక్తి గల కాంతిని కూడా విడుదల చేస్తుంటాయి. వీటితో కంటి చూపుకు తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. ఈ పరికరాలకు సాధారణ కాంతి కంటే ఎక్కువ దూరం ప్రయాణించే గుణం ఉండటం, అధిక తరంగ శక్తి కలిగి ఉండడంతో కంటి లోపలి వరకు ఈకాంతి చేరుతోంది. సాధారణ పరికరాల కంటే ఈ పరికరాల నుంచి వెలువడే నీలిరంగు కాంతి ఎక్కువగా కంటిచూపుపై ప్రభావాన్ని చూపుతుంది. సహజంగా నలభై ఏళ్లు పైబడిన తర్వాత దృష్టిలోప సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం ఎక్కుయిన తర్వాత యువతలోనూ కంటి సమస్యలు అధికమైనట్లు తేటతెల్లమవుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ సెల్‌ఫోన్‌లను అధిక రేడియో ధార్మిక శక్తి విడుదల చేసే పరికరాలుగా 2011లోనే ప్రకటించింది.



స్మార్ట్ భారత్...

భారత్‌లోనూ స్మార్ట్‌ఫోన్లకు అంతకంతకు ఆదరణ పెరుగుతూనే ఉంది. ఈఏడాది మొదటి త్రైమాసికంలో భారత్‌లో స్మార్ట్ ఫోన్ల అమ్మకాలు 70 శాతం పెరిగాయని కౌంటర్ పాయింట్ రీసెర్చ్‌సంస్థ వెల్లడించింది. అమెరికా తర్వాత స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు భారత్‌లోనే ఎక్కువ. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ల మార్కెట్‌గా అవతరించింది. వచ్చే ఐదేళ్లలో భారత్‌లో ఒక బిలియన్‌కు పైగా స్మార్ట్‌ఫోన్లు అమ్ముడవుతాయని అంచనా.

ఇవి పాటించండి...

● తప్పనిసరిగా కంప్యూటర్స్, ల్యాప్‌ట్యాప్‌లపై పనిచేసే వారు నీలిరంగు కాంతి ప్రభావాన్ని తగ్గించే సామర్థ్యం ఉన్న ప్రత్యేక కళ్లద్దాలను వాడాలి.
● యాపిల్స్, ఐప్యాడ్‌లో కొత్తగా నైట్‌షిఫ్ట్ ఆప్షన్ ప్రవేశపెట్టారు. దీంతో కంటిపై ఒత్తిడి తగ్గుతుంది. ఇటీవల పలు యాప్స్‌లోనూ ఈమోడ్ ఉంటుంది. దీనిని ఆన్‌చేసుకోవడం మంచిది.
● 20 నిమిషాలు మించి ఏకధాటిగా ఎలక్ట్రానిక్ పరికరాలు చూడకూడదు.
● స్మార్ట్ ఫోన్లలో అక్షరాల పరిణామం పెంచుకుంటే మంచిది. కంటికి వీలైనంత దూరంగా ఫోన్‌ను పట్టుకొని చూడాలి.
● ల్యాప్‌ట్యాప్, ట్యాబ్‌లకు వీలైనంత వరకు బయట కీబోర్డు పెట్టుకోవడం మంచిది. దీంతో కంటికి దగ్గరగా చూడాల్సిన అవసరం తప్పుతుంది.

దృష్టి సమస్యలు ఇలా...

కంప్యూటర్ వినియోగించే వారిలో 50 శాతం. ల్యాప్‌టాప్ వాడకం దారుల్లో 59 శాతం, స్మార్ట్ ఫోన్ వినియోగదార్లలో 70 శాతం దృష్టి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

సమస్యలు తలెత్తుతాయి
కంటివైద్య నిపుణులు

కంప్యూటర్లు, ల్యాప్‌ట్యాప్‌లు, స్మార్ట్‌ఫోన్ల వాడకం మూలంగా పిల్లల్లో దృష్టి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. అధిక వినియోగం వల్ల దృష్టి లోపంతో పాటు వేరే ఇతర సమస్యలకు దారి తీయవచ్చు. నీలిరంగు కాంతి ప్రభావాన్ని తగ్గించే సామర్థ్యం కలిగిన కళ్ల అద్దాలను వాడడం మంచిది.

ఇబ్బంది ఉన్నా కంప్యూటర్ అవసరమే ఎక్కువ



ప్రస్తుత కాలంలో కంప్యూటర్ వాడటం తప్పనిసరి అయింది. ఏ విషయాన్నైనా మాన్యువల్ వదిలి అన్ని కంప్యూటర్‌లో ఫీడ్ చేయడం వల్ల ప్రతిదాన్ని కంప్యూటర్‌లోనే పరిశీలించాల్సి వస్తోంది. కంప్యూటర్ అధిక వినియోగం వల్ల కళ్లపై ఒత్తిడి పెరుగుతుంది. ప్రస్తుతం కంప్యూటర్ లేకుండా ఏ పనులు చేసుకోలేము. ఇబ్బంది ఉన్నా కంప్యూటర్ వాడకం అత్యవసరం. నిత్య జీవితంలో మానవునికి స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లు తప్పనిసరి అయ్యాయి.

-నరేందర్‌రెడ్డి,
ఇంజనీరింగ్ విద్యార్థి

క్యారెట్లు, పండ్లను అధికంగా తీసుకోవాలి



తరచూ కంప్యూటర్ వాడటం వల్ల కళ్లు డ్రై కావడం, ఎలర్జీ, ఇరిటేషన్ రావడం జరుగుతుంది. కళ్లు ఎర్రబడతాయి. తప్పనిసరిగా కంప్యూటర్లు వాడవలసి వస్తే గంట సమయంలో పదినిమిషాలు చొప్పున కళ్లను మూసుకుని కళ్లకు మసాజ్ చేసుకోవాలి. ప్రతిరోజు 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోవాలి. అత్యవసరం అనుకుంటే యాంటి గ్లేర్ కళ్లజోళ్లు ధరించి కంప్యూటర్ వాడాలి. ఏ-విటమిన్‌కు సంబంధించిన క్యారెట్లు, పండ్లను అధికంగా తీసుకోవాలి.

-భాగ్యశేఖర్‌గౌడ్, సూపరింటెండెంట్,
తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

ఆధ్యాత్మికతతో అలరారుతున్న శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయం



షాద్‌నగర్‌టౌన్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో గల శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయం ఆధ్యాత్మికతతో అలరారుతున్నది. ఈ ఆలయాన్ని 2000 సంవత్సరంలో పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కట్టా నర్సింహులు స్వయంగా నిర్మించారు. 2003 జూలైలో శ్రీ చిన్నజీయర్‌స్వామి చేతుల మీదుగా ఈ ఆలయ ప్రారంభోత్సవం జరిగింది. నాటి నుంచి నేటి వరకు ఆలయంలో ప్రతి సంవత్సరం పలు పర్వదినాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా జూన్, జూలై మాసాల్లో ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ముఖ్యంగా శ్రావణమాసంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఎంతో వైభవంగా ఆచరిస్తుండగా వందలాది మంది మహిళలు పాల్గొని తరిస్తున్నారు. అలాగే శ్రీరామనవమికి సీతారాముల కల్యాణం, ఉగాదికి పంచాంగ శ్రవణం కార్యక్రమాలను ఎంతో ఘనంగా చేపడతారు. పట్టణానికి చెందిన ఎంతోమంది భక్తులు ప్రతినిత్యం ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

ఉద్యోగపర్వం

పాత పింఛన్ విధానాన్నే అమలు చేయాలి

● టీయస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివారెడ్డి, రంగారెడ్డి జిల్లా



కేశంపేట: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి. సెప్టెంబర్ 1, 2004 తర్వాత నియమితులైన ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయులకు ఫ్యామిలీ పింఛన్, డెత్ గ్రాట్యుటీని వెంటనే కల్పించాలి. వాటికి సంబంధించిన జీవోలను విడుదల చేయాలి. ఉద్యోగులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు భద్రత కల్పించకపోవడం శోచనీయం. కాంట్రిబ్యూషన్ పింఛన్ పథకాన్ని ఉద్యోగులపై బలవంతంగా అమలు చేయడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. ఉద్యోగస్తులు ఉద్యోగంలో ఉన్నప్పుడు మరణిస్తే వారి కుటుంబాలు రోడ్డుపై పడుతున్నాయి. 1982లో సుప్రీంకోర్టు పింఛన్ పొందుట ఉద్యోగి హక్కు అని తీర్పు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని దృష్టిలో పెట్టుకొని పాత పింఛన్‌ను అమలు చేయాలి.

ఉరేసుకుని ఇద్దరి మృతి


మౌనిక మృతదేహం

వనస్థలిపురం: ఇంటిపై కప్పు రాడ్డుకు చీరతో ఉరి వేసుకొని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. హయత్‌నగర్‌కు చెందిన గడ్డం వెంకటేశ్వర్లు కుమార్తె మౌనిక డిగ్రీ పూర్తి చేసి కొంతకాలంగా ఇంట్లోనే ఉంటోంది. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈమె ఇంటిపై కప్పు రాడ్డుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతనంగా నిర్మాణంలో ఉన్న భవనంలోని రెండో అస్తులో పిల్లర్‌కు చీరతో ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వెస్టుగోదావరి జిల్లాకు చెందిన సిరివరపు సీతారామ్, రామలక్ష్మీ దంపతులు వన్థలిపురంలోని క్రిస్టియన్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు విజయ్(20) పాస్టు ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఇతడికి మనసిక స్థితి సరిగాలేదు. శుక్రవారం ఉదయం నూతనంగా నిర్మిస్తోన్న భవనంలోని రెండో అంస్తులో పిల్లర్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి రామలక్ష్మీ ఫిర్యాదుతో ఎస్‌ఐ వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు..

కొత్తూర్: కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో గాయపడ్డ ఇరువురు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నందిగామ మండలంలోని నర్సప్పగూడ గ్రామానికి చెందిన కృష్ణయ్య (50) అనే వ్యక్తి ఈనెల 8న కొత్తూర్‌కు వచ్చి వెళ్తుండగా, హైద్రాబాద్ నుంచి షాద్ నగర్ వైపు వస్తున్న మోటార్‌సైకిలిస్టు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడగా, హైద్రాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అలాగే చౌదరిగూడ మండలం జాకారం గ్రామానికి చెందిన యాదమ్మ (50) తన కుమారుడు శంకర్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జేపీ దర్గాకు వెళ్తూ ఇన్ముల్‌నర్వ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడడంతో యాదమ్మ తీవ్రంగా గాయపడగా ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందిందని తెలిపారు. కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని లక్ష్మీనర్సింహా కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపారు. సుమారు 55 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి కొన్నేళ్ల నుంచి బిక్షాటన చేస్తూ జీవించే వాడని తెలిపారు. శుక్రవారం కాలనీలో పడివుండటంతో చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించగా 11 గంటలకు మృతిచెందినట్లు తెలిపారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చెరువులో పడి ఎద్దు..


మృతిచెందిన ఎద్దు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామ సమీపంలో కోన చెరువులో శుక్రవారం నీరు తాగడానికి వెళ్లిన ఎద్దు బురదలో జారిపడి మృతి చెందింది. గ్రామానికి చెందిన నక్క పెద్దనర్సింలుకు చెందిన ఎద్దు నీరు తాగడానికి చెరువులోకి వెళ్లి మృత్యువాత పడింది. కాడెద్దు విలువ 60వేలు ఉంటుందని రైతు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. వైరు చోరీ

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామశివారులోని అలిసాబ్‌గూడలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దొంగలు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు, ఆయిల్ దొంగిలించినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలి

● త్వరలో 'పట్నం'కు సీఎంను రప్పిస్తాం ● ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

యాచారం: గుడుంబా అమ్మి నాడు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపినవారు నేడు స్వయం ఉపాధితో ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని గుడుంబా బాధితులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో గుడుంబా ప్రభావిత వ్యక్తుల పునరావాస పథకం కింద ఆస్థుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 16 మందికి ఆస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గుడుంబ అమ్మకం శాశ్వతంగా మానిన వారికి ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నిధులను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కిరాణదుకాణం, ఆటోలు, హోటల్స్ నడపడం వంటి వాటితో జీవనం గడపడానికి ఉపయోగించాలన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధికి గాను ముఖ్యమంత్రి 25 కోట్ల నిధులు ఇచ్చారన్నారు. ప్రతి గ్రామానికి పది లక్షల నిధులతో ఎస్సీ, ఎస్టీ వాడలలో సీసీ రోడ్ల నిర్మాణం, అంతర్గగ డ్రైనేజీ ఏర్పాటు వంటి పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో విధిగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని సర్పంచులను, ఎంపీటీసీలను ఆదేశించారు. నాలుగున్నర కోట్ల నిధులతో నగర శివారు ప్రాంతమైన బీఎన్ రెడ్డి నగర్ నుంచి ఇబ్రహీంపట్నం వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. మరో రెండు లేదా మూడు మాసాలలో ఇబ్రహీంపట్నంకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రప్పించి అభివృద్ధికి మరిన్ని నిధులు రాబడుతామన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పేదల జీవితాల్లో వెలుగు నింపుతుందని ఎంపీపీ రమావత్ జ్యోతినాయక్ చెప్పారు. గిరిజనులు, ఎస్సీలు, బీసీలు గుడుంబా అమ్మి జైలుకెళ్లారని ఆమె ఆందోళన చెందారు. సమావేశంలో ఎంపీడీవో కె.ఉష, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, జెడ్పీటీసీ కె.రమేష్‌గౌడ్, గున్‌గల్, యాచారం, తక్కళ్లపల్లి, నందివనపర్తి, చిన్నతూండ్ల, మంతన్‌గౌరెల్లి గ్రామాల సర్పంచులు మల్లిఖార్జున్, కళమ్మ, భవాని, వి.రాజునాయక్, సత్యపాల్, నర్సింహా, నజ్దిక్‌సింగారం, తక్కళ్లపల్లి, మేడిపల్లి ఎంపీటీసీలు భాగ్యమ్మ, మాధవి, శ్రీశైలం, టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్, శంకర్‌నాయక్, లిక్కి నర్సింహారెడ్డి, జంగయ్యగౌడ్ ఉన్నారు.

ఆరుగురు దోపిడీ దొంగలు అరెస్టు

● 8 లక్షలు విలువైన 310 బ్యాటరీలు, 186 సీసం రాడ్లు, 4 వాహనాలు, కత్తి, 2 బొమ్మ పిస్తోళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బ్యాటరీలు, సీసం రాడ్లు చూపుతున్న డీసీపీ

కొత్తపేట: నగర శివారు కొత్తూరు, షాద్‌నగర్, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో గల పరిశ్రమల్లో బ్యాటరీలు, బరువైన సీసం రాడ్లు దొంగిలించి బయట మార్కెట్లో అమ్మేసి సొమ్ము చేసుకునే ఆరుగురు దోపిడీ దొంగలను బాలాపూర్, పహాడీషరీఫ్ క్రైం టీం పోలీసులు అరెస్టు చేసి, రూ 8 లక్షలు విలువైన 310 బ్యాటరీలు, 186 సీసం రాడ్లు 4 వాహనాలు, కత్తి, 2 బొమ్మ పిస్తోళ్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో డీసీపీ వెంకటేశ్వర్ రావు విలేకరులకు వివరాలను వెల్లడించారు. శంషాబాద్ పరిధిలో ఉండే క్రేన్ వ్యాపారి మహ్మద్ ఫారుక్ అలీ(22), వెల్డర్‌గా పనిచేసే జావెద్(24), ఆటో డ్రైవర్ అబ్దుల్ కరీం(20), డ్రైవర్‌గా పనిచేసే మహ్మద్ అబ్దుల్ రహ్మాన్(20), కారు మెకానిక్‌గా పనిచేసే మహ్మద్ జహంగీర్ పాషా(21), చంద్రాయణగుట్టలో ఉండే ఆటో డ్రైవర్ సయ్యద్ రఫీక్(25)లు ముఠాగా ఏర్పడి , పగలు రెక్కీ చేపట్టేవారు. వారు ముఖాలకు ముసుగులు వేసుకుని రాత్రులు రాచకొండ కమిషనరేట్, సైబరాబాద్‌లలో ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల గోడలు దూకి, దొంగతనాలు చేస్తున్నారు. పరిశ్రమల్లో ఉండే వారిని బొమ్మ పిస్తోళ్లతో, కత్తితో బెదిరించేవారు. పనివాళ్లందరినీ ఒక గదిలో బంధించేవారు, విలువైన బ్యాటరీలు, సీసం రాడ్లు దొంగిలించేవారు. ఆయా ఫ్యాక్టరీల బయట పార్క్ చేసిన వాహనాల్లో బ్యాటరీలు, సీసం రాడ్లనూ డంప్ చేసుకుని ఉడాయించేవారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు హైదరాబాద్ - శ్రీశైలం దారిలో జల్‌పల్లి గేట్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న బాలానగర్, పహాడీషరీఫ్ పోలీసులకు నేరస్థులు స్క్రాప్ బ్యాటరీలు, సీసం రాడ్లు రెండు ట్రాలీల్లో తీసుకెళుతూ పట్టుబడ్డారు. వారు ట్రాలీల్లో ఎత్తుకెళుతున్న బ్యాటరీలు, లెడ్ రాడ్లతో ఎర్రకుంట నుండి తుక్కుగూడవైపు వెళుతున్నారు. వారిని అరెస్టు చేసి, విచారించారు. తదుపరి విచారణ కోసం వారిని కస్టడీకి తీసుకోనున్నట్లు డీసీపీ తెలిపారు. సమావేశంలో ఏసీపీలు రవీందర్‌రెడ్డి, వేణు గోపాల్‌రావు, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, పహాడిషరీఫ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి కాంత్‌రెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బడంగ్‌పేటను 'పచ్చని కోట'గా మారుస్తాం

● నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్ వెల్లడి


మొక్క నాటి నీరు పోస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు

సరూర్‌నగర్: హరితహారంలో భాగంగా నగర పంచాయతీ పరిధిలోని ఖాళీ ప్రదేశాల్లో అధిక సంఖ్యలో మొక్కలు నాటి బడంగ్‌పేటను పచ్చని కోటగా మార్చడానికి ప్రయత్నిస్తున్నామని చైర్మన్ సామ నర్సింహాగౌడ్, వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 17వ వార్డు పరిధిలోని వాది ఎ సనా కాలనీలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని, స్థానిక కౌన్సిలర్ అంగోత్ దశరథ్‌తో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో అన్ని వార్డుల్లోనూ హరిత హారం కార్యక్రమం చేపట్టామని అన్నారు. నాటిన మొక్కలను సంరక్షించుకునే బాధ్యత స్థానికులదేనని వారన్నారు. కాలనీలవాసులు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆయా ప్రాంతాల్లోని మొక్కల సంరక్షణ బాధ్యతను చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దండు గణేశ్‌ముదిరాజ్, ఎర్ర మహేశ్వరీజైహింద్ కుమార్, ఆర్‌వో వెంకటేశం, స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక తనిఖీల్లో 120 మందిపై కేసులు

అనంతగిరి: ప్రత్యేక తనిఖీల్లో 120 మందిని పట్టుకుని 40 మందిపై కేసులు నమోదు చేశామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌చందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైళ్లలో అనుమతి లేకుండా తినుబండాలరాలు అమ్ముతున్న 26 మందిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా రైలు పట్టాలు దాటి ఫ్లాట్‌ఫామ్‌పైకి వెళ్లిన 54 మందిపై, నోపార్కింగ్ స్థలంలో వాహనాలు పార్క్‌చేసిన 20 మంది, మహిళా బోగీలో, లగేజీ బీగోలో ప్రయాణం చేసిన 14 మంది, రిజర్వేషన్ బోగిల్లో ప్రయాణం చేసిన 5 మంది, ట్రైన్‌లో అలారం చైన్ లాగిన ఒకరిపై కేసు నమోదు చేసి క్యాంపు కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరి నుంచి సుమారు రూ. 31 వేలు జరిమానా విదించినట్లు తెలిపారు. ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫామ్ నుంచి ఇంకో ఫ్లాట్‌ఫామ్‌కు పట్టాలు దాటి వెళ్లకూడదని ఆయన హెచ్చరించారు. అత్యవసర సహాయం, ఇతర ఫిర్యాదులకు 183ని సంప్రదించాలని ఆయన సూచించారు.

15న బ్రాహ్మణ సమాఖ్య సమావేశం

● సంఘం నాయకుడు శృజన్

చేవెళ్ల రూరల్ : ఈనెల 15వ తేదీన చేవెళ్ల మండల కేంద్రంలో బ్రాహ్మణ సమాఖ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆ సంఘం నాయకుడు ఎల్.కె. శృజన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. చేవెళ్ల నియోజకవర్గ బ్రాహ్మణ సమాఖ్య సమావేశం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో మధ్యాహ్నం 2:30 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని బ్రాహ్మణులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

సంక్షేమంలో తెలంగాణ ముందంజ

● ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం ముందున్నదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డితో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. పేద మహిళల పెళ్లి ఖర్చుల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అబివృద్ధి సాధిస్తున్నదని కొనియాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రభుత్వం ఇవ్వనుందని స్పష్టం చేశారు. దేశంలో సంక్షేమ పథకాలు ఎక్కువగా అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ శ్రీధర్, మండల టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి వాసుదేవ్, మాజీ ఎంపీటీసీ పాపారావు తదితరులు ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే



విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న వెంకటేశంగుప్తా

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూతనందిస్తాం

● చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశంగుప్తా

చేవెళ్ల రూరల్ : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో బాగా చదువుకుని ఉన్నతులుగా అభివృద్ధి చెందాలని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం. వెంకటేశంగుప్తా తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని దామరగిద్ద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు, పలకలు, టైలు, బ్యాచ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం కోసమే ఉచితంగా నోటుపుస్తకాలతో పాటు పలకలు, టైలు, బ్యాచ్‌లు అందివ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యాబోధన కొనసాగించాలని సూచించారు. మున్ముందు పాఠశాల అభివృద్ధికి మరింత చేయూత అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, మౌనిక, సరిత, జయమ్మ, రాధ, నాయకులు తెలుగు భిక్షపతి, రామకృష్ణరెడ్డి, శ్రీశైలం, మల్లేశ్, అనంతయ్య, విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు.



విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● చేవెళ్ల అగ్నిమాపక శాఖ అధికారి బిక్షపతి

చేవెళ్ల రూరల్ : అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేవెళ్ల అగ్నిమాపక శాఖ అధికారి బిక్షపతి తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు అగ్నిప్రమాదల నివారణ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు అగ్నిమాపక శాఖ అధికారులకు, 101కు సమాచారం అందించాలని సూచించారు. ఇంట్లో వంటగదిలో కిటికీలు వంటచేసే సమయంలో తెరిచి ఉంచాలన్నారు. గ్యాస్ లీకై మంటలు వస్తే భయపడకుండా నీటిలో తడిపిన గుడ్డను సిలిండర్‌పై కప్పితే మంటలు అరిపోతాయని చెప్పారు. పెద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటే సమాచారం అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిబ్బంది అనంతయ్య, వంశీ, సునీల్, గోవర్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు.

'గ్రామాభివృద్ధిపై సవతి తల్లి ప్రేమ'

మొయినాబాద్ : అనుబంధ గ్రామం కావడంతో గ్రామాభివృద్ధిపై ప్రతినిధులు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఎవరు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామంలో అభివృద్ధి కుంటుపడుతోందని చిన్నమంగళారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన వీరన్నపేట గ్రామస్థులు ఈవోపీఆర్‌డీ విఠల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో నెలకొన్న సమస్యలను వెల్లడించారు. చిన్నమంగళారం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన వీరన్నపేటలో గత 12 ఏళ్ల నుంచి గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరుగడంలేదని తెలిపారు.

గ్రామస్థాయి ప్రజాప్రతినిధి నుంచి నియోజకవర్గ స్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధి గురించి ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మురుగు కాలువ ఉన్నా వాటిని శుభ్రం చేసే వారు ఎవరు లేక ఈగలు, దోమలు ముసురుకోవడంతో పాటు దుర్వాసన వెదజల్లుతోందని అన్నారు. దాని ద్వారా ప్రజలు ఆనారోగ్యం పాలు కావాల్సి వస్తుందని తెలిపారు. ప్రజలు రోగాల బారిన పడినా ఆరోగ్య శాఖ సిబ్బంది ఎవరూ ఇక్కడ మళ్లీ చూడరని తెలిపారు. గ్రామంలో ఇళ్ల మధ్య పాడుబడ్డ ఇళ్లు కూలి పోవడంతో పిచ్చి మొక్కలు పెరగడం వలన ప్రజలు బయట తిరగాలన్నా భయపడుతున్నారని చెప్పారు. గ్రామంలో వీధి దీపాలు కూడా లేవని తెలిపారు. మూడు నెలల నుంచి గ్రామంలో నీటి సమస్య ఉందని ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా అధికారులు అనుబంధ గ్రామమైన వీరన్నపేట గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలని గ్రామస్థులు కోరారు.



ఈవోపీఆర్‌డీ విఠల్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

విద్యార్థినికి చేయూత

నార్సింగ్: ఇటీవల పదవతరగతి పరీక్షలలో 9.0 ర్యాంక్ సాధించిన ఓ నిరుపేద విద్యార్థి పి.నవ్యను మణికొండ నాయకులు జూనియర్ కళాశాలలో చేర్పించారు. సీఏ చేయాలన్న లక్ష్యంతో చైతన్య కళాశాలలో జాయిన్ అయ్యేందుకు సిద్ధం అయిన ఆ విద్యార్థినికి తగిన ఫీజు చెల్లించే స్థోమత లేకపోవడంతో తాను చదువుకున్న మణికొండ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించింది. దీంతో వారు స్థానిక మణికొండ ఎంపిటిసి-2 సభ్యుడు కె. రామకృష్ణారెడ్డికి వివరించారు. దీంతో ఈ అమ్మాయి రెండేళ్లు ఇంటర్ చదువుకునేందుకు ఫీజు కట్టేందుకు కె. రామకృష్ణారెడ్డి, స్థానిక నాయకుడు బ్రహ్మాజి ముందుకు వచ్చారు. దీంతో శుక్రవారం నాడు ఫీజును వారు విద్యార్థినికి అందజేశారు.

'పిల్లలకు నులిపురుగుల మాత్రలు తప్పనిసరి'



నులిపురుగుల మందు వేస్తున్న ఉపాధ్యాయుడు

చేవెళ్ల రూరల్ : పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా వేయించాలని ప్రధానోపాధ్యాయుడు నానక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నులిపురుగుల మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలోని విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహార లోపం సమస్య రాకుండా ఉపయోగపడుతుందన్నారు.

మొక్కలు నాటి సంరక్షించుకోవాలి: సీఐ



చేవెళ్లలో మొక్క నాటుతున్న సీఐ గురువయ్య తదితరులు

చేవెళ్ల రూరల్ : మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాలని చేవెళ్ల సీఐ గురుయ్య తెలిపారు. హరితహారంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎస్సై శ్రీధర్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్‌ముదిరాజ్, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'

శంకర్‌పల్లి: హరితహారం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎంఈవో అక్బర్ పేర్కొన్నారు. శంకర్‌పల్లిలోని రేవతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పచ్చదనానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని అన్నారు. మనిషి మనుగడకు చెట్లు ముఖ్యమైనవని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కల ప్రాముఖ్యత ఎంతో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ జేమ్స్ ఉన్నారు.

సురంగల్ ఎంపీటీసీ ఈగ రమాదేవేందర్‌రెడ్డి మేనకోడలు సాహితి (వికారాబాద్) ఉపసర్పంచ్ యాలాల జైపాల్‌రెడ్డి మేనల్లుడు మధుప్రకాష్‌రెడ్డి(తెల్లాపూర్)ల వివాహం శుక్రవారం మొయినాబాద్ మండలంలోని అంజనాదేవి గార్డెన్‌లో జరిగింది. ఈవివాహ వేడుకకు మాజీ హోంమంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలెయాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మేడ్చల్ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

-మొయినాబాద్



ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌కు భూమి పూజ

మాడ్గుల : మండలంలోని ఆర్కపల్లిగ్రామ పంచాయితీ పరిధిలోని పడమటి తండాలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి శుక్రవారం ఎంపిపి జైపాల్‌నాయక్, జడ్పీటీసీ పగడాల రవిలు భూమి పూజ చేశారు. పడమటి తండా,ఆర్కపల్లి గ్రామంలో మంచి నీటి సమస్యను తీర్చాడానికి ట్యాంకల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీపీ, జడ్పీటీసీలు తెలిపారు. పడమటి తండాకు 9.5లక్షల రుపాయలు ,ఆర్కపల్లికి 6.5లక్షల రూపాయలతో ట్యాంక్ నిర్మాణం పనులు చేపట్టారు. అట్టి పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు వారు సూచించారు. గ్రామ సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ లాలయ్యగౌడ్, ఆర్కపల్లి మాజీ సర్పంచ్ కూభ్యానాయక్ పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సింగిల్‌విండో కార్యాలయం

- నిరుపయోగంగా సొంత భవనం
- సౌకర్యాలు లేని అద్దెభవనం
- స్థలం ఇస్తే భవన నిర్మాణానికి డీసీసీబీ అంగీకారం

ఆమనగల్లు : పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అసౌకర్యాల నడుమ కొనసాగుతోంది. సౌకర్యాలు లేని భవనంలో ఇటు రైతులు, అటు కార్యాలయ ఉద్యోగులు, పాలకవర్గం ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకు సానుకూలత ప్రకటించిన అవసరమైన ప్రభుత్వ స్థలం లేకపోవడం సమస్యగా మారింది. ఆమనగల్లు సింగిల్‌విండో కార్యాలయానికి పట్టణ సమీపంలోని గుర్రంగుట్ట వద్ద రెండు దశాబ్దాల కిందట లక్షల రూపాయలు వెచ్చించి సొంత భవనం నిర్మించారు. కాగా నిర్మించిన భవనం పట్టణానికి దూరంగా ఉండడంతో రైతులు రావడానికి ఇబ్బంది పడేది. దీంతో ఏడేళ్ల కిందట పట్టణంలోని బస్టాండ్ వెనుక భాగంలో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రి క్వార్టర్‌లోకి మార్చారు. మండల పరిషత్ ఆదీనంలో ఉన్న భవనం కాలపరిమితి మించి పోయి శిథిలావస్థ కు చేరింది. తాత్కాలిక మరమ్మ తు చేసి కార్యాలయాన్ని సాగిస్తున్నారు. సింగిల్ విండో కార్యాలయం సొంత భవన నిర్మాణానికి ప్రస్తుతం కార్యాలయం కొనసాగుతున్న భవనం, దాని సమీపంలో ఉన్న ఖాళీ స్థలానివ్వాలని మండల పరిషత్‌కు సింగిల్‌విండో చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ పలుమార్లు ప్రతిపాదనలు పంపారు. మండల పరిషత్ సమావేశంలో సైతం కేటాయింపు విషయాన్ని ప్రస్తావించారు. అయినప్పటికీ మండలపరిషత్ నుంచి ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుతంఉన్న స్థలం సింగిల్‌విండో కార్యాలయ భవన నిర్మాణానికి అనుకూలంగా ఉంది. అదే విధంగా మండల పరిషత్ కార్యాలయంలో కూడా పాత కార్యాలయం భవనం వృథా గా పడి ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సింగిల్‌విండో కార్యాలయ నూతన భవనానికి స్థలం, నిధులు కేటాయించి భవనం నిర్మించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



అసౌకర్యాల నడుమ కొనసాగుతున్న సింగిల్‌విండో కార్యాలయం

స్థలం అప్పగిస్తే భవన నిర్మాణం చేస్తాం



మండల పరిషత్ కార్యాలయ ఆదీనంలో ఉన్న ప్రస్తుత భవనం , స్థలం ఆమనగల్లు సింగిల్ విండో కార్యాలయానికి కేటాయించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించాం. మండల సమావేశాలలో కూడ ఈ విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. స్థలం కేటాయిస్తే భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు డిసిసిబి సుముఖత వ్యక్తం చేసింది. ప్రస్తుత పాత భవనం , స్థలం నూతన భవన నిర్మాణానికి అనుకూలంగా ఉంది. రైతులకు కూడ ఇక్కడే అన్ని విధాల సౌకర్యంగా ఉంటుంది.

- జర్పుల దశరథ్ నాయక్, సింగిల్ విండో చైర్మన్-ఆమనగల్లు

వేర్వేరు చోట్ల 'హరితహారం'



కడ్తాల్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

తలకొండపల్లి : మండల పరిధిలోని బదునాపూర్ గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ సైదబాబు ఆధ్వర్యంలో ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పాండయ్య, పోలీస్‌సిబ్బంది ,స్థానిక నాయకులు గణేశ్,రాజు, మల్లేశ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : సకాలంలో వర్షాలు కురవాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కడ్తాల తహసీల్దార్ రవికుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అన్మాస్‌పల్లి వెళ్లే రోడ్డులో స్థానిక సర్పంచ్ వేణుగోపాల్, నాయకులతో కలిసి తహసీల్దార్ మొక్కలు నాటారు. ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్, సర్పంచ్ వేణుగోపాల్, ఎంపీటీసీలు వెంకటేశ్,లక్ష్మయ్య, నాయకులు పాల్గొన్నారు.



తలకొండపల్లిలో మొక్కలు నాటుతున్న ఎస్ఐ సైదబాబు

'మైసమ్మ ఆలయం సందర్శన'



పూజలనంతరం ఆలయంలో భట్టు నందిని విక్రమార్క

ఆమనగల్లు : జిల్లాలో ప్రసిద్ది గాంచిన మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని శుక్రవారం కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లుభట్టు విక్రమార్కు సతీమణి మల్లు నందిని సందర్శించారు. శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళ్తున్న ఆమె మైసమ్మ దేవతను దర్శించుకొని ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైసిగండి ఉప సర్పంచ్ కమల మోత్యనాయక్, నాయకులు హీరా నాయక్, రమేశ్, కిషన్‌నాయక్,మోత్యనాయక్, జవహర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభం

మాడ్గుల : మండలంలోని ఇర్విన్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే నిధుల నుంచి బోరు డ్రిల్లింగ్ పనులను ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్ల గౌడ్, నాయకులు యాదయ్య గౌడ్, యాదయ్య, జంగయ్య, రాములు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం'

ఆమనగల్లు: ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం, విద్యారంగ బలోపేతం కోసం ఎస్టీయు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తుంది. ఎస్టీయు టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కసిరెడ్డి పురుషోత్తం రెడ్డి అన్నారు. 70ఏళ్ల ఎస్టీయు ఎన్నో మన విజయాలు సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఆమన గల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈనెల14న హయత్‌నగర్‌లోని స్వామి శంకర్ పంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఎస్టీయూటిఎస్ 70 వసంతాల ఉద్యమోత్సవ వేడుకలకు సంబంధించి రూపొందించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను మండల ఆ సంఘం నాయకులు ,ఉపాధ్యాయులతో కలిసి పురుషోత్తం రెడ్డి ఆవిష్కరించారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పురుషోత్తం రెడ్డి

మాడ్గుల: ఎస్టీయుటిఎస్ 70వ వసంతాల ఉద్యమోత్సవాన్ని విజయ వంతం చేయాలని ఎస్టీయు టిఎస్ రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హయత్ నగర్‌లోని స్వామి శంకర్ పంక్షన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎమ్ఈవో రామా జంగారెడ్డి, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

మీజిల్స్ ,రుబెల్లా టీకాలపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ జైపాల్ నాయక్

మాడ్గుల : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాథమిక ఆసుపత్రి లో శుక్రవారం మీజిల్స్, రుబెల్లా టీకాలపై డాక్టర్ లలిత ఆశ కార్యకర్తలకు,అంగన్‌వాడీ వర్కర్లకు ,ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందస్సు కు ఎంపీపీ జైపాల్ ఇబ్రాహింపట్నం క్లస్టర్ కార్యాలయం నుంచి సిహెచ్‌వో గోపాల్ రెడ్డి, నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈనెల 17నుంచి సెప్టెంబర్ 23 వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని ఆమె తెలిపారు. ఎంపీటీసీ లాలయ్య గౌడ్,నిరంజన్, ఎంపీడీవో పారుక్‌హుస్సెన్ పాల్గొన్నారు.

చెరువుకుంట మరమ్మతు పనులు ప్రారంభం

కడ్తాల్ : మిషన్ కాకతీయలో భాగంగా మండల కేంద్రంలోని ఎదుపువలోని కుంట చెరువు మరమతు పనులకు రూ.2లక్షలు మంజూరైనట్లు శుక్రవారం మరమతు పనులను సర్పంచ్ వేణుగోపాల్, ఎంపీటీసీ లక్ష్మయ్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

ఆమనగల్లు : తెలంగాణ విద్యార్థి సంఘం (టిఎస్‌యు) ఆధ్వర్యంలో ఆమనగల్లు పట్టణంలోని మాస్టర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించారు. టీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి కట్ట జంగయ్య, జేఏసీ మండల నాయకుడు పాపిశెట్టి రాములు పోటీలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ సభ్యుడు చిత్తరంజన్ దాస్, కళాశాల ప్రిన్సిపాల్ చందునాయక్, అధ్యాపకులు యాదయ్య, బాలు, నర్సింహ్మ, టిఎస్‌యు నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి నిర్మాణానికి భూమి పూజ

కడ్తాల్ : మండల పరిధిలోని మక్తమాదారం ప్రాథమికోన్నత పాఠశాలలో సర్వే పల్లి రాధాకృష్ణ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం స్థానిక సర్పంచ్ నర్సింహ్మ విగ్రహ దాత మహేందర్‌తో కలిసి భూమి పూజ చేశారు. పాఠశాలలో విగ్రహం ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి నర్సింహ్మ, నాయకులు మహేందర్, నర్సింహ్మగౌడ్, కృష్ణనాయక్, ధనరాజ్, సాయిలు,చందు,యాదగిరి, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ఆదిభట్ల: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కొంగరకలాన్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొంగర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వ్యాస రచన, దేశ భక్తి గీతాల ఆలాపన వంటి అంశాలపై పోటీలను నిర్వహించారు. ఇందులో ఎనిమిది, తొమ్మిది, పదవ తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 15న బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు సక్కుబాయి, యువజన నాయకులు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా బోజిరెడ్డి

ఇబ్రహీంపట్నం: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఇబ్రహీంపట్నం మండలం కర్ణంగూడ గ్రామానికి చెందిన నల్లబోలు బోజిరెడ్డిని నియమించారు. ఈమేరకు ఢిల్లీలో కిసాన్ మోర్చా జాతీయ అధ్యక్షుడు వీరేంద్రసింగ్ చేతుల మీదుగా ఆయన నియామక ఉత్తర్వులు అందుకున్నారు. విద్యార్థి దశ నుంచే ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌లో పనిచేసిన ఆయన 2003 నుంచి బీజేపీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. బీజేపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కోశాధికారిగా ఆయన పనిచేశారు. ఆయన సేవలను గుర్తించి కిసాన్ మోర్చాలో పదోన్నతి కల్పించినట్లు వీరేంద్రసింగ్ తెలిపారు. ఈ సందర్భంగా బోజిరెడ్డి మాట్లాడుతూ రైతాంగ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు.



బోజిరెడ్డిని సన్మానిస్తున్న పట్నం బీజేపీ నాయకులు

కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం రైతాంగం ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. తెలంగాణలో 42 లక్షల మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని, ప్రధానమంత్రి పసల్ బీమా యోజనను 7 లక్షల మంది మాత్రమే చేశారని, దీనిపై విస్తృత ప్రచారం కల్పించాల్సి ఉందని అన్నారు. వచ్చే రోజుల్లో రైతాంగం మద్దతు పూర్తి స్థాయిలో బీజేపీకి అనుకూలంగా మార్చడానికి కృషి చేస్తామని ఆయన చెప్పారు. కాగా తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించినందుకుగాను వీరేంద్రసింగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, సుగుణాకర్‌రావు, పాపయ్యగౌడ్‌లకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. కాగా ఇబ్రహీంపట్నంలోని బాలాజీ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల భాస్కర్, దొండరమణారెడ్డి, టౌన్ అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ టేకుల రాంరెడ్డి, యువమోర్చా మండల అధ్యక్షుడు మూర్తి జంగారెడ్డి బోజిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

పీఆర్‌టీయూ 'పట్నం' అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: పీఆర్‌టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా సీయాపీఎస్ ఉప్పరిగూడకు చెందిన చిత్రమల్ల శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికైనారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.మధుసూదన్ గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లారెడ్డి, కార్యదర్శులుగా వి.ఆంజనేయులు, లక్ష్మీనర్సమ్మ, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఆర్. భాగ్యలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా వి.పరమేష్, ప్రతాప్‌రెడ్డి వ్యవహరించారు.

నేడు మండల కార్యవర్గ సమావేశాలు

ఆదిభట్ల: భారతీయ జనతా పార్టీ ఇబ్రహీంపట్నం మండల పార్టీ కార్యవర్గ సమావేశాలు ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మొగిలి గణేష్ తెలిపారు. మండల పరిధిలోని కల్వకోలు భూపాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, మండల కార్యవర్గంలోని నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

భూములు రీ సర్వే

ఇబ్రహీంపట్నం: తెలంగాణ ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మండలంలో తుర్కగూడ, చెర్లపటేల్‌గూడ, చింతపల్లిగూడ గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద శనివారం (నేడు) నుంచి 15 వరకు భూములు రీసర్వే నిర్వహిస్తుందని తహసీల్దారు కె.వెంకట్ రెడ్డి తెలిపారు. భూమి హక్కుదారులు/పట్టాదారులు దగ్గరుండి హద్దులు చూపాలని ఆయన చెప్పారు.

ఇంటర్వ్యూ...

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

● మంచాల మండల వైద్యాధికారి డా.విజయలలిత



మంచాల : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల వైద్యాధికారి డా.విజయలలిత సూచించారు. సీజనల్ వ్యాధులపై వైద్యాధికారి డా.విజయలలితతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ.

ప్ర : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి చెబుతారా?

జ : వర్షాకాలంలో తాగునీరు కలుషితమై వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, కలరా, పచ్చకామెర్లు, ఇంకా క్రిమికీటకాలతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయి.

ప్ర : ఈ వ్యాధి సోకిన వారిని ఎలా కాపాడుకోవాలి?

జ : సీజనల్ వ్యాధుల్లో ఎక్కువగా అంటువ్యాధులుగా మారతాయి. ఆలస్యం చేయకుండా బాధితులను సమీపంలోని ఆసుపత్రుల్లో చికిత్స చేయించాలి. ప్రభుత్వాసుపత్రుల్లో ఇట్టి వ్యాధులకు ఉచితంగా మందులు లభిస్తాయి.

ప్ర : తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి..?

జ : వర్షాకాలంలో క్లోరినేషన్ చేసిన రక్షిత తాగునీటిని సేవించుట ద్వారా, కలుషితనీరు తాగడంవల్ల వచ్చే వ్యాధులను అరికట్టవచ్చు. ఈగలు, దోమలను అరికట్టుట ద్వారా క్రిమికీటకాల వల్ల వచ్చే డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా వ్యాధులను నివారించవచ్చును. ఇందుకోసం పరిసరాల పరిశుభ్రతపాటించాలి. క్రమం తప్పకుండా మురుగు నీటి కాల్వలు, నీటితొట్లల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ ఉండాలి. ముఖ్యంగా ప్రతిశుక్రవారం డ్రై డేగా పాటించాలి. అంటే వారానికోసారి నీటితొట్లను ఖాళీచేసి తిరిగి నింపుకోవాలి. ఇంకా ఫాగింగ్ చేయించాలి.

రెండోరోజుకు చేరిన టాటా ఉద్యోగుల నిరసన



ధర్నా చేస్తున్న కార్మికులు

ఆదిభట్ల: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్లలోని టాటా సంస్థలో పనిచేసే ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం శుక్రవారం రెండవ రోజుకు చేరింది.సంస్థకు సంబంధించిన దాదాపు ఐదొందలకు పైగా కార్మికులు విధులను బహిష్కరించి టాటా ఏరోస్పేస్ సంస్థ ముందు బైఠాయించి ధర్నాకు దిగారు. టాటా సంస్థలైన అడ్వాన్స్ సిస్టం టాటా లాకిన్ మాటిన్ టాటా ఏరో స్పేస్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులతో పని గంటలు అధికంగా చేయిస్తూ సరైన జీతం ఇవ్వటం లేదని, యాజమాన్యం అనేక రకాలుగా వేధింపులకు గురిచేస్తోందని వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఉద్యోగులు టాటా ఏరో స్పేస్ సంస్థ ఎదుట బైఠాయించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికిని యాజమాన్యం మాత్రం స్పందించక పోవడం చర్చకు దారితీస్తోంది. యాజమాన్యం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు ప్రజలనుంచి పెద్దఎత్తున నిరసన వ్యక్తం అవుతోంది. ఈ కార్యక్రమానికి రెండవ రోజు వివిధ రాజకీయ కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్మికులపై వేధింపులు చేస్తున్న యాజమాన్యం తీరును విమర్శించారు. నల్ల జండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న శిబిరానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్ గౌడ్, ఐఎన్‌టీయూసీ నాయకులు చంద్ర శేఖర్ పాల్గొని వారికి మద్దతు తెలిపారు. కార్మికుల సమస్యలకు పరిష్కారం లభించే వరకు వారికి మద్దతుగా తాము ఉంటామని పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని వారు యాజమాన్యాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, సదానంద్, అనిల్ కుమార్, చేతన్ తదితరులు పాల్గొన్నారు. కాగా టాటా సంస్థ ఎదుట వందల సంఖ్యలో ఉద్యోగులు ఒక్కసారిగా ధర్నాకు దిగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఆదిభట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోవింద రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు.ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం వరకు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన కార్మికులు డిమాండ్లు పరిష్కరించే వరకు విధుల్లోకి చేరేది లేదని తెలిపారు.

'బెల్టు దుకాణాలు నడిపితే కఠిన చర్యలు'

యాచారం : బెల్టు దుకాణదారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన యాచారం మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. గుడుంబా తయారు చేసినా, క్రయ విక్రయాలకు పాల్పడినా చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేడు ఇస్తున్న రెండు లక్షల నిధుల వాడకంపై తాము తరచూ ఆయా కుటుంబాలను తనిఖీ చేస్తామన్నారు. ఈ నిధులను పొదుపుగా వాడి ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని సలహా ఇచ్చారు. పలు చోట్ల బెల్టుదుకాణాలు నడుస్తున్నట్లు సమాచారం దింది దాడులు చేసి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.



అన్నదాతలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి..

● రీజనల్ బ్యాంక్ అధికారి రాధాకృష్ణ మూర్తి

మంచాల : బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని రీజనల్ బ్యాంకు అధికారి రాధాకృష్ణ మూర్తి రైతులకు సూచించారు. ఎస్‌బీఐ రైతు వారోత్సవాల్లో భాగంగా ఆరుట్ల ఎస్‌బీఐ బ్యాంకులో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో రైతులకు బ్యాంకులో కల్పిస్తున్న రుణసదుపాయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలని సూచించారు. రైతులు తరచూ బ్యాంకును సందర్శించి ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవాలన్నారు. దీంతో బ్యాంకుల ద్వారా ప్రభుత్వం కల్పించే రాయితీలపై సంపూర్ణ సమాచారం లభిస్తుందన్నారు. అనంతరం బ్యాంకు సదుపాయాలపై కేవీస్ రూరల్ మీడియా ప్రతినిధులు శ్రీనివాస్ బృందంచే సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆరుట్ల బ్రాంచి మేనేజర్ నరేంద్రకుమార్, సర్పంచులు జిలమోని సత్తయ్య, ఆనంగళ్ల యాదయ్య, గ్రామపెద్దలు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, కె.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరంలాంటిది

● టీఆర్ఎస్ నేత చంద్రశేఖర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎస్సారెస్పీని నింపడానికి కేసీఆర్ ప్రభుత్వం చేసున్న కృషిని తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారని వాస్తవాలను విపక్షాలు గ్రహిస్తే మంచిదని టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇక్కడ ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఈ.సీ.శేఖర్‌గౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏనాడూ లేనిది తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాతే సాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతంగా నడుస్తున్నాయని అన్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీల హయాంలో సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారంటూ ఆయన ఆందోళన వెలిబుచ్చారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రోడ్లు ఇతర మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నారని ఆయన అన్నారు.

కేసీఆర్‌ది అరాచక పాలన

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేష్



ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న బాలమల్లేష్

ఇబ్రహీంపట్నం: తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను వంచిస్తూ, అరాచక పాలన కొనసాగిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎన్.బాలమల్లేష్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని రావి నారాయణరెడ్డి భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ వరకు ఉచితవిద్య, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ వస్తే ధర్నాలు ఉండవని చెప్పి ప్రజలు, ప్రజాసంఘాలు నిరసన తెలపడానికి కూడా అవకాశం లేకుండా ఏకంగా ధర్నా చౌక్‌ను రద్దు చేయడం ఎంతటి దుర్మార్గపు పాలనో అర్థమవుతుందన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ 21న ధర్నా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నాలో అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. నేరెళ్ల సంఘటనపై ప్రభుత్వం న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు పది లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు మాట్లాడుతూ.. కమ్యూనిస్టులపై సీఎం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని ఆయన అన్నారు. కమ్యూనిస్టుల పోరాలు ఎన్నికల కోసం కాదనేది గుర్తెరగాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఏర్పాటవుతున్న పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు, రాష్ట్ర సమితి సభ్యుడు రవీంద్రాచారి, మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆకు చంద్రకళ, జిల్లా అధ్యక్షురాలు పి.నీలమ్మ, పి.జంగయ్య, శివరాల లక్ష్మయ్య, విజయ్‌కుమార్, నర్ల శ్రీశైలం తదితరులున్నారు.

బూర్గులను సందర్శించిన.. పలు దేశాల ప్రతినిధులు



గ్రామాన్ని సందర్శిస్తున్న విదేశీ బృందం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల, కాసిరెడ్డిగూడ గ్రామాలను మారిషస్, శ్రీలంక, జోర్డాన్, ఇరాక్, బంగ్లాదేశ్, వెనిజులా, ఈజిప్టు, కెన్యా దేశాల ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. విదేశీ మంత్రిత్వశాఖ, హైదరాబాద్ రాజేంద్రనగర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరానికి హాజరైన 9 దేశాల ప్రతినిధులు గ్రామ సందర్శనలో భాగంగా బూర్గుల గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి గురించి తెలుసుకున్నారు. కాసిరెడ్డిగూడలోని మినరల్‌వాటర్ ట్యాంకును పరిశీలించి మహిళా సంఘాల పనితీరు, పరిసరాల పరిశుభ్రత గురించి తెలుసుకున్నారు. ఎన్ఐఆర్డీ ప్రొఫెసర్లు డాక్టర్ గంగిరెడ్డి, డాక్టర్ శివరాం, రూపేష్ ఆధ్వర్యంలో బృందం సభ్యులు వచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమన, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి శంకర్, పంచాయతీ కార్యదర్శి గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేకు నేడే శ్రీకారం

- పైలెట్ ప్రాజెక్టుగా రంగారెడ్డిజిల్లా ఎంపిక ● 87 ఏళ్ల తరువాత జరుగుతున్న భూముల సమగ్ర సర్వే
- ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ, చింతపల్లిలో ప్రారంభం
- ● ఆధునాతన పరికరాలతో కచ్చితంగా భూకొలతలు ● నాలుగు రోజుల్లో ఈ రెండు గ్రామాల్లో సర్వే పూర్తి
- ● రైతులంతా అందుబాటులో ఉండాలని అధికారుల ఆదేశం ● కమిటీలో కలెక్టర్, జేసీలకు చోటు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : 87 ఏళ్ల తరువాత తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా భూముల రీసర్వే ప్రారంభం కానుంది. ఇందుకోసం పైలెట్ ప్రాజెక్టుగా ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ, చింతపల్లి గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ రెండు గ్రామాల్లో సమగ్ర భూసర్వే కార్యక్రమానికి నేడు శ్రీకారం చుట్టనుంది. కేవలం నాలుగు రోజుల్లో ఈ రెండు గ్రామాల్లో అన్ని భూములను రీసర్వే చేసి మ్యాపులు తయారు చేసి రికార్డుల్లో నమోదు చేస్తారు. దీని ఫలితాల ఆధారంగా తరువాత రాష్ట్రవ్యాప్తంగా భూముల రీసర్వే పక్రియ చేపడతారు. తెలంగాణలో 1930 తరువాత భూముల సర్వేలు జరగలేదు. కాలక్రమేణ భూముల వినియోగంలో మార్పులు జరగడంతో భూములు వివాదాలు పెరుగుతూ వస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని రోజుల్లో జరిగిన భూముల సర్వే వల్ల కొన్నిచోట్ల పొరపాట్లు జరిగాయి. దశాబ్దాలుగా భూముల రీసర్వే జరగకపోవడంతో భూముల కొలతల్లో తేడాలు అలానే కొనసాగుతూ వివాదాలు పెరుగుతూ వస్తున్నాయి. దీన్ని ఆసరా చేసుకుని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి వివాదాలను మరింత జఠిలం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్ని రకాల రెవెన్యూ రికార్డులను నవీకరణ చేయాలని నిర్ణయించింది. భూముల సమగ్ర సర్వేతో పాటు రెవెన్యూ రికార్డుల్లో సవరణలు చేయాలని నిర్ణయించింది. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పక్కాగా రికార్డులు రూపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. భూముల రీసర్వేకు కేంద్రం నుంచి కూడా సానుకూలత రావడంతో ప్రభుత్వం ఈ పక్రియకు శ్రీకారంచుట్టింది. రెవెన్యూ సిబ్బందితో పాటు ప్రైవేటు ఏజెన్సీ ఈ సర్వేలోపాల్గొంటుంది. ఆర్ఎస్ఐ అనే ప్రైవేటు ఏజెన్సీకి ఈ పని అప్పగించారు. డీజీపీఎస్ అనే ఆధునిక సర్వే యంత్రాలతో ఈ సర్వే చేపడుతున్నారు. మొదట గ్రామంలో ఉన్న భూమి ఎంత? సర్వేనంబర్లు వారీగా రికార్డుల్లో నమోదు అయిన భూమి ఎంత? క్షేత్రస్థాయిలో ఏమైనా తేడాలు ఉన్నాయా? అనేది చూస్తారు. ఆధునాతన పరికరాలతో భూముల రీసర్వే చేస్తారు. ఈ కొలతల ఆధారంగా రెవెన్యూ రికార్డులు రూపొందిస్తారు. మొదట మ్యాపులు గ్రామాలు, సర్వేల వారీగా మ్యాపులు తయారు చేస్తారు. ఈ సర్వే సమయంలో వచ్చిన ఇబ్బందులు, ఇతరాత్ర సమస్యలను పరిశీలించి పూర్తిస్థాయిలో రాష్ట్ర వ్యాప్త సర్వేకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తుంది. ఈ సర్వేలో పాల్గొన్న రైతులకే పంటపెట్టుబడి పథకం కింద లబ్ధిచేకూరుస్తామని అధికారులు చెబుతున్నారు. . పంటపెట్టుబడి పథకం కింద ప్రభుత్వం ఏటా రైతులకు ఉచితంగా రూ. 8వేలు అందించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద లబ్ధిపొందాలంటే సర్వేలో రైతులంతా పాల్గోవాలని సూచిస్తున్నారు.

కలెక్టర్, జేసీకి కీలక బాధ్యతలు

భూముల సమగ్ర సర్వే కోసం ప్రభుత్వం కమిటీ వేసింది. రెవెన్యూ వ్యవహారాల్లో అపార అనుభవం ఉన్న జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, జేసీ సుందర్ అబ్నార్‌లకు కీలక బాధ్యతలు అప్పగించింది. కమిటీకి కలెక్టర్ రఘునందన్‌రావు అధ్యక్షతన వేసిన కమిటీలో ఖమ్మం, సిద్దిపేట కలెక్టర్లు సభ్యులుగా ఉన్నారు. అలాగే భూముల రీసర్వేకు మార్గదర్శకాల రూపకల్పన బాధ్యతలు జేసీ సుందర్ అబ్నార్‌కు అప్పగించారు. ఇందువల్లే భూముల రీసర్వే పైలెట్ ప్రాజెక్టు చేపట్టేందుకు జిల్లాను ఎంపిక చేశారు.

గ్రామానికి 20 మంది సిబ్బంది

ప్రస్తుతానికి భూముల రీసర్వేకు ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మండలం తుర్కగూడ, చింతపల్లిగూడ గ్రామాలను ఎంపిక చేసింది. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఈ గ్రామాల్లో కేవలం నాలుగు రోజుల్లోనే భూముల సర్వే పూర్తి చేస్తారు. ఈ సర్వేలో ప్రభుత్వ రెవెన్యూ అధికారులతో పాటు ప్రైవేటు ఏజెన్సీకి సంబంధించిన సిబ్బంది పాలుపంచుకుంటున్నారు. ప్రతి గ్రామానికి రెండు సర్వే బృందాలను పంపుతున్నారు. ఇందులో రెవెన్యూ సిబ్బంది ఒక టీమ్ కాగా ప్రైవేటు ఏజెన్సీకి సంబంధించి మరో టీమ్ ఉంటుంది. రెవెన్యూ టీమ్‌లో ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఒక డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వో, సర్వేయర్ ఉంటారు. ప్రైవేటు ఏజెన్సీ నుంచి కూడా మరికొందరు సర్వేయర్లు ఈ సర్వేలో పాల్గొంటారు. ఇలా ఒక్కో గ్రామంలో సుమారు 20 మంది సిబ్బంది సర్వేలో పాలుపంచుకుంటారని అధికారులు తెలిపారు.

ఎక్కడ ఉన్నా సర్వేకు రావాలి: జేసీ


ఈ రెండు గ్రామాల్లో ఈనెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు భూముల రీసర్వే నిర్వహిస్తున్నందున ఇక్కడ భూమి ఉన్న రైతులు తప్పనిసరిగా సర్వేకు హాజరుకావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సుందర్ అబ్నార్ ఆదేశించారు. ఈ గ్రామాలకు చెందిన రైతులు హైదరాబాద్‌లో ఉన్నా, ఇంకా ఎక్కడ ఉన్నా కూడా తప్పనిసరిగా తమ భూ రికార్డులతో సర్వేకు హాజరై తమ భూమి హద్దులు చూపించి అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సర్వే సమయంలో ఉండి తమ భూములరీసర్వే చేయించుకున్న వారికి భవిష్యత్తులో ఎలాంటి రెవెన్యూ ఇబ్బందులు ఉండవని చెప్పారు. ప్రజల సౌకర్యార్థమే ఈ సర్వేను ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం దరఖాస్తుల ఆహ్వానం

(ఆంధ్రజ్యోతి,రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : సెప్టెంబర్ అయిదో తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక పక్రియచేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఎయిడెడ్, తెలంగాణ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కొరరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొంది. దరఖాస్తుఫారములు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి పొందవచ్చని సూచించింది. ఉపాధ్యాయులు తమ ప్రతిపాదనలను సంబంధిత మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు (ఉన్నత పాఠశాల) ధృవీకరణతో ఈనెల 20వ తేదీలోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందచేయాలని సూచించింది.

శిథిలదశలో ఫిరంగి కాలువ

షాబాద్ : తెలంగాణ ప్రభుత్వంలోనైనా ఫిరంగి కాలువ మరమ్మతులకు మోక్షం కలిగేనా... రైతుల ఆశలు చిగురించేనా... షాబాద్ మండలం చందన్‌వెళ్లిలోని ఈసీ వాగుపై క్రీస్తుశకం 1872వ సంవత్సరంలో నిర్మించిన చిన్నకత్వ నుంచి ఒక రూపాన్ని సంతరించుకునే ఫిరంగి కాలువ ఇబ్రహీం పట్నంలోని పెద్ద చెరువును 135 ఏళ్ల పాటు నింపుతూ వచ్చింది. కత్వకు ఉన్న కేవలం రెండంటే రెండు తూముల నుంచి నిరంతరం పారే నీటితో 84 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద చెరువు నిండేది. అదే సమయంలో వందకు పైగా గ్రామాల పరిధిలోని భూగర్భ జలాల స్థాయి నిలకడగా ఉండేవి., అధికారుల పర్యవేక్షణలేమి, పాలకుల నిర్లక్ష్యం మూలంగా ఫిరంగి కాలువను 26కిలోమీటర్ల పొడవున పలువురు ఆక్రమించేశారు. ఫలితంగా 2006వ సంవత్సరం నుంచి ఇబ్రహీంపట్నం పెద్దచెరువు నిండటం



కత్వ నుంచి నీటి మళ్లింపు జరిగే ప్రాంతం

లేదు. చందన్‌వెళ్లిలోనూ కత్వ నిర్వహణను గాలికి వదిలేశారు. ఈసీనది పైభాగంలో ఇసుక తవ్వకాలతో నీరు కత్వలోకి రావడంలేదు. ఎంతో పటిష్టమైన కట్టడం క్రమంగా శిథిలమవుతోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొనడంతోపాటు ప్రజలు చైతన్యమైతే తప్ప ఫిరంగి కాలువకు మళ్లీ పూర్వరూపం వచ్చేలా లేదు.

ఫిరంగి కత్వకు పూర్వవైభవం తీసుకురావాలి



ఫిరంగి కత్వకు పూర్వవైభవం తీసుకురావాలి. తెలంగాణ ప్రభుత్వంలోనైనా ఈ కత్వకు మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నాం. మిషన్‌కాకతీయ పథకం ద్వారా కత్వాకు మరమ్మతులు చేసి పూర్వవైభవం తీసుకువస్తే మళ్లీ ఇబ్రహీంపట్నం పెద్ద చెరువును నింపవచ్చు.

- కోలన్ సుధాకర్‌రెడ్డి, చందన్‌వెళ్లి



ఎయిర్‌పోర్టుకాలనీలో సామూహిక శ్రీమంతాలు

శంషాబాద్ : మండలకేంద్రం శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టు కాలనీలో శుక్రవారం జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక శ్రీమంతాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ సురేష్‌గౌడ్ హాజరై మహిళలకు చీరలు, పూలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం గోపాల్, జీఎంఆర్ ప్రతినిధులు హాజరయ్యారు.

ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటయ్యేనా?



శంషాబాద్ ఆర్టీసీ బస్టాండు

శంషాబాద్ : శంషాబాద్‌లో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు కోసం మండలవాసులు ఎదురు చూస్తున్నారు. శంషాబాద్‌లో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేస్తామని రెండు దశాబ్దాల నుంచి ప్రభుత్వాలు చెబుతూ చివరిక్షణంలో మాట దాటవేస్తూ వస్తున్నాయి. ప్రస్తుతం శంషాబాద్ పేరుతో జిల్లా ఏర్పాటు చేస్తామని చెప్పి, చివరిదశలో శంషాబాద్ జిల్లా పేరుతో కాకుండా రంగారెడ్డి పేరును పెడుతున్నట్టు అదేవిధంగా ప్రకటించింది. కాంగ్రెస్ సర్కార్ అధికారంలో ఉండగా మిషన్‌కాంపౌండ్ సమీపంలో ఆర్టీసీ బస్‌డిపోను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అందుకోసం అప్పుడు ఆర్టీసీ సంస్థకు సంబంధించిన పదవిలో ఉన్న

మూడు దశాబ్దాలుగా తీరని సమస్య

కాంగ్రెస్ నేత కోదండరెడ్డి శంషాబాద్‌లో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేస్తానని చెప్పి.. స్థలపరిశీలనతోపాటు అన్ని ఏర్పాట్లు చేయించారు. మరో పదిరోజుల్లో డిపో ఏర్పాటవుతుందనగా ఆ కార్యక్రమం వాయిదా పడింది. మళ్లీ ఐదేళ్ల తరువాత డిపో ఏర్పాటు ప్రక్రియ మొదలైంది. అప్పుడు పెద్దషాపూర్‌లో ఏర్పాటు చేయడానికి స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలాన్ని పలుసార్లు సందర్శించారు. అయితే ఏమైందో ఏమో తెలియదు కాని అదీ వాయిదాపడింది. అనంతరం కొద్దిరోజుల తర్వాత ధర్మగిరి, పోషెట్టిగూడ ప్రాంతాల్లో డిపో కోసం భూములను సర్వే చేశారు. పోషెట్టిగూడ సమీపంలో స్థలం కేటాయించి.. ఆ స్థలం చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయించారు. ఎందుకనో అక్కడా ఏర్పాటు కాలేదు. ఈ విషయమై ప్రస్తుత జిల్లా ఇన్‌చార్జి మంత్రి మహేందర్‌రెడ్డిని ప్రశ్నిస్తే తప్పకుండా ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆ తరువాత చౌదరిగూడలో ఆర్టీసీ బస్‌డిపో కోసం స్థలం పరిశీలించారు. ఇలా రెండు దశాబ్దాలుగా హామీలు ఇవ్వడం.. స్థలాలను పరిశీలించడం.. చివరికి పట్టించుకోకపోవడం పాలకులకు అలవాటుగా మారిందని మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా బస్‌డిపో ఏర్పాటుకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

మధ్యవర్తులను ఆశ్రయించొద్దు : తహసీల్దార్



రెవెన్యూ సమస్యను పరిష్కరించి పత్రాన్ని ఇస్తున్న తహసీల్దార్

కందుకూరు : భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి మధ్యవర్తులను ఆశ్రయించ వద్దని తహసీల్దార్ పి.క్రిష్ణకుమార్ తెలిపారు. శుక్రవారం మండలపరిధిలోని ధన్నారం, చిప్పలపల్లి, మురళీనగర్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూసదస్సుల్లో ఆయన మాట్లాడారు. రైతులకు ఎదురవుతున్న రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మరణించిన రైతు కుటుంబసభ్యుల పేర విరాసత్ చేయించుకోకుండా నిర్లక్ష్యం చేసిన వారికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఎంతో దోహదపడుతున్నట్లు తెలిపారు. రెవెన్యూ గ్రామాలవారీగా సదస్సులను నిర్వహించి అక్కడికక్కడే విరాసత్ ప్రొసీడింగ్‌లను ఇస్తున్నామన్నారు. ఈ రోజు నిర్వహించిన సదస్సుల్లో ధన్నారం గ్రామంలో 2, చిప్పలపల్లిలో 7, మురళీనగర్‌లో 5 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పొట్ట అరుణ, అమృత, ఎంపీటీసీ జయమ్మ, ఆర్ఐ జంగయ్య, వీఆర్‌వోలు కృష్ణయ్య, గణేష్, సుధాకర్‌గౌడ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలాన్ని గుర్తించి నక్షబాట తీయాలి



తహసీల్ధార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్థులు

కందుకూరు : కందుకూరు రెవెన్యూలో శ్మశానవాటిక స్థలాన్ని వెంచర్ నిర్వాహకులు ఆక్రమిస్తున్నట్లు, స్థలాన్ని గుర్తించి హద్దులను ఏర్పాటు చేయాలంటూ గ్రామస్థులు తహసీల్ధార్ పి.క్రిష్ణమార్‌ను కోరారు. శుక్రవారం బీజేపీ మండల నాయకులు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా మాట్లాడారు. రెవెన్యూగ్రామంలోని 1015 సర్వే నెంబర్‌లో ఎకరం 8గుంటల భూమి శ్మశానవాటికకు ఉందన్నారు. దానిని వెంచర్‌లోకి కలుపుకొని ప్లాట్లుగా మారుస్తున్నట్లు తెలిపారు. అదే సర్వేనెంబర్‌లో నక్షబాటకూడ ఉందన్నారు. అధికారులు స్మశాన వాటిక భూమితోపాటు నక్షబాటను గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా నాయకుడు మంద పాండు, డి.వెంకటయ్య, యాదయ్య, ఎడ్ల జంగయ్య, ఉదయ్‌కుమార్, క్రిష్ణ, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు



దెబ్బడగూడలో వరలక్ష్మివ్రతం చేస్తున్న మహిళలు

కందుకూరు : శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మండలపరిధిలోని పలు గ్రామాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలు, కుంకుమార్చన కార్యక్రమాలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో పలు దేవాలయాలను శోభాయమానంగా అలంకరించారు. దెబ్బడగూడ గ్రా మంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సుమారు 80మంది మహిళలు సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించి, కుంకుమార్చన కార్యక్రమాలను చేపట్టారు. దీంతోపాటు మీర్కాన్‌పేటలో సాయిబాబ దేవాలయంలోను మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. లేమూరు, కొత్తగూడ, కందుకూరు, ముచ్చర్ల, గూడూరు రాచులూరు పులిమామిడి,నేదునూరు, దాసర్లపల్లి, గ్రామాల్లోనూ వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు.

రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారికి మేలు : సీఐ



రక్తదాన శిబిరంలో సీఐ విజయ్‌కుమార్, ఎస్సై ప్రభాకర్

కందుకూరు : రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్నవారికి ఎంతో మేలు చేకూరుతుందని, రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని కందుకూరు సీఐ విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం కందుకూరు లయన్స్‌క్లబ్ ఆధ్యక్షుడు సురసాని వెంకట్‌రంగారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని భూలక్ష్మి మెమోరియల్ ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని ఆయన మాట్లాడారు. రక్తాన్ని దానం చేసిన వారి ప్రాణాలకు ఎలాంటి ఆపద రాదన్నారు. కందుకూరు లయన్స్‌క్లబ్ వారు ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను తమ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం సర్వసాధారణమని ఆ క్లబ్ మండల శాఖ అధ్యక్షుడు వెంకట్‌రంగారెడ్డి తెలిపారు. అందులో భాగంగా తమ క్లబ్ మండల వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహేందర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ క్యాంపులో 23మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జి.ప్రభాకర్, క్లబ్ జిల్లా నాయకులు మహేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి దీపారెడ్డి, ఎన్.లక్ష్మారెడ్డి, వార్డుసభ్యుడు రాజశేఖర్‌గుప్త, దీక్షిత్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సామేల్, న్యూఆదర్శ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

కందుకూరు : నేడు బీజేపీ మండలస్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల మీడియా సెల్ కన్వీనర్ గంగుల వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30గంటలకు మండల పార్టీ అధ్యక్షుడు సాధ మల్లారెడ్డి అధ్యక్షతన మండలకేంద్రంలోని సీతారామశాస్త్రీ కల్యాణ మండపంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి దళిత మోర్చ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోసుపల్లి ప్రతాప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. మండలపరిధిలోని అన్ని గ్రామాల పోలింగ్ బూత్‌స్థాయి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఎక్కడ పడితే అక్కడే..!

ఔటర్‌రింగురోడ్డు సమీపంలో యథేచ్ఛగా చెత్త పడవేత

శంషాబాద్ : డంపింగ్‌యార్డ్ లేకపోవడంతో శంషాబాద్ గ్రామ పంచాయతీపరిధిలోని ఔటర్‌రింగురోడ్డు పక్కన కొందరు గుర్తు తెలియని వ్యక్తులు యథేచ్ఛగా చెత్త పడేస్తున్నారు. గతంలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు కోసం గ్రామపంచాయతీ కార్యవర్గం కలెక్టర్ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందించి హమీదుల్లానగర్ సమీపంలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే ఆ పరిసర గ్రామాల్లోని సర్పంచ్‌లు వ్యతిరేకించారు. దీంతో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు నిలిచిపోయింది. ఈ వ్యవహారంలో ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల మధ్య వాగ్వాదం కూడ జరిగింది. అప్పట్లో శంషాబాద్‌లో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు.కొందరు గుర్తుతెలియని వ్యక్తులు శంషాబాద్ రాళ్లగూడ రోడ్డులో ఉన్న ఔటర్ రింగురోడ్డు పక్కనున్న సర్వీసురోడ్డు పక్కన యథేచ్ఛగా చెత్త వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వ్యాపించి ప్రయాణి కులకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం వెంటనే డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఔటర్‌రింగురోడ్డు సర్వీసు రోడ్డుపై పడేసిన చెత్త

రెడ్డి సేవా సమితి నూతన కార్యవర్గం ఏర్పాటు

కొత్తూర్: మండల పరిధిలోని కొడిచర్ల గ్రామ రెడ్డి సేవా సమితి నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్‌రెడ్డి బాలకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా బొంతల మహిపాల్‌రెడ్డి, కళ్లెం ఆనంద్‌రెడ్డి, ప్రధానకార్యదిర్శగా బి. మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కళ్లెం కృష్ణారెడ్డి, కోశాధికారిగా నవీన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మామిడి దామోదర్‌రెడ్డి, కళ్లెం నర్సింహ్మారెడ్డి, సురేందర్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ వైపు.. అంతరాష్ట్ర దొంగల కన్ను

- లారీ డ్రైవర్లను టార్గెట్ చేస్తున్న ముఠా
- రహదార్ల పక్కన లారీలు నిలిపితే దోపిడే


దోపిడీ జరిగిన లారీని పరిశీలిస్తున్న సీఐ

కొత్తూర్: అంతరాష్ట్ర షికారీ దొంగల కన్ను కొత్తూర్ పారిశ్రామికవాడ మీద పడింది. పారిశ్రామికవాడలోని ఆయా పరిశ్రమలకు లోడింగ్, అన్ లోడింగ్‌కు వచ్చే లారీల డ్రైవర్లపై దాడులు చేసి దొరికినంత దోచుకుపోతున్నారు. కొత్తూర్ పారిశ్రామికవాడతో పాటు తిమ్మాపూర్, నందిగామ గ్రామాలలో విరివిగా పరిశ్రమలు వెలిశాయి. అయితే దేశంలోని ఆయా ప్రాంతాలకు చెందిన లారీలు ఈ ప్రాంతాలకు లోడింగ్, అన్‌లోడింగ్ కోసం ప్రతినిత్యం వందల సంఖ్యలో వచ్చి వెళ్తుంటాయి. సాంకేతిక లోపం కారణంగానో, విశ్రాంతి కోసం, హోటళ్ల కోసం రహదార్ల పక్కన లారీల డ్రైవర్లు వాహనాలను నిలుపుతుంటారు. అంతర్రాష్ట్ర దొంగలు ముఠాగా ఏర్పడి లారీ డ్రైవర్లను టార్గెట్ చేస్తూ నిలిచి ఉన్న లారీలపై దాడులు జరుపుతూ దొరికినంత దోచుకుంటున్నారు. బుధవారం అర్ధరాత్రి కొత్తూర్ పారిశ్రామికవాడ సమీపంలో రహదారి పక్కన నిలిచి ఉన్న లారీపై రాళ్లతో దాడి జరిపి లారీలో నిద్రిస్తున్న డ్రైవర్ రాంజకన్ చౌహాన్ నుంచి 9వేల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను దొంగిలించుకపోయిన సంఘటన పాఠకులకు విధితమే. షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో దారి దోపిడీకి పాల్పడి లక్షాలాది రూపాయలను దోచుకుని పోయిన మహారాష్ట్రకు చెందిన దారి దోపిడి ముఠాలోని నలుగురు సభ్యులను షాద్‌నగర్ పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. 44వ జాతీయ రహదారిపై లారీలను నిలిపి ఉంచి నిద్రిస్తున్న డ్రైవర్లపై దాడులు జరిపి డబ్బులు దోచుకపోతుంటారని పోలీసుల విచారణలో వెల్లడైంది. ముఠాలోని ఒకరు చీర కట్టుకుని రోడ్డు ప్రక్కన నిలబడి టార్చిలైటు వేసి లారీలను ఆపి డ్రైవర్ల వద్ద దొరికినంత దోచుకుపోతుంటారు. దోపిడీ దొంగలు భువనగిరి, చౌటుప్పల్, భూత్పూరు తదితర చోట్ల కూడ దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ముఠా సభ్యులను అరెస్ట్ చేసిన రెండు రోజులకే కొత్తూర్ పారిశ్రామికవాడ సమీపంలో లారీపై దాడి చేసి నగదు దోచుకపోవడం పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. అంతర్ రాష్ట్ర షికారీ ముఠాలోని మిగిలిన సభ్యులే ఈ దోపిడికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దోపిడికి పాల్పడిన దొంగలను పట్టుకునేందుకు షాద్‌నగర్ రూరల్ సీఐ మధుసూదన్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు ముమ్మర గాలింపులు చేపట్టాయి. రహదారుల పక్కన లారీలను నిలిపే డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులపై అనుమానం కలిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ మధుసూదన్ సూచించారు.

ఇప్పలపల్లిలో ఆధ్యాత్మిక శోభ

- బంగారు కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

కేశంపేట: మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామ సమీపంలోని చెరువు కట్టపై నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం పూజారి మఠం శేఖరయ్య ఆధ్వర్యంలో సర్పంచ్ కృష్ణవేణివెంకటేష్, ఉప సర్పంచ్ కిషన్‌నాయక్ నేతృత్వంలో బంగారు కట్ట మైసమ్మ విగ్రహ్మ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వేద మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. భక్తులు బంగారు మైసమ్మకు ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, జడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, ఎంపిటీసీ మంద మంజుల, టీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, జంగయ్య, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, జగదీశ్వర్, శంకర్, వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, కట్ట వెంకటేష్ యాదవ్, కృష్ణారెడ్డి, మార్గం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి, కందివనం గ్రామాల బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు టీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు పి. వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. చించోడ్ నుంచి దేవునిపల్లి వరకు మూడు కిలోమీటర్లు, చించోడ్ నుంచి కందివనం గ్రామానికి 4 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.2.83 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామానికి వెళ్లి గ్రామస్థులకు మిఠాయిలు పంచి బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మణికొండ రవిగౌడ్, టీఆర్ఎస్ నాయకులు అందెబాబయ్య, అంచె రాములు, పరంధాములు, శ్రీహరి తదితరులు ఉన్నారు.

పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

పరిగి: మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామ సంఘం నాయకులు పి.హన్మంత్‌రెడ్డి, ఎన్.జగన్, జి.అంజనేయులు, బి.శ్రీనివాస్, జి.రాములు, ఎ.నర్సింహులు తదితరులు కలిసి శుక్రవారం పరిగి తహసీల్దార్ అబిద్‌అలీ, ఎంపీడీవో విజయప్పలకు వినతిపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ, రాఘవాపూర్ గ్రామం ప్రస్తుతం కాళ్లాపూర్ పంచాయతీకి అనుబంధంగా కొనసాగుతుందని తెలిపారు. కాళ్లాపూర్ పంచాయతీకి రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు.

'1న భారీ నిరసనలు'

కులకచర్ల: సీపీఎస్ విధానం రద్దు కోరుతూ సెప్టెంబరు 1న వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని టీఎస్ సీపీఎస్ ఈఏ రాష్ట్ర కార్యదర్శి చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ముజాహిత్‌పూర్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. సెప్టెంబరు 1న సెలవు మంజూరు చేయాలని ఉపాధ్యాయులంతా తమ సెలవు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు వెంకటయ్య, శీనయ్య, చందర్, మల్లేశ్, మొగులయ్య, సంగీత, మాధవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనకు ఉపాధ్యాయుల గైర్హాజరు

విద్యార్థులచే ప్రార్థన చేయించిన ఎంపీపీ


విద్యార్థులచే ప్రార్థన చేయిస్తున్న లక్ష్మమ్మ

కేశంపేట: ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. తమ ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కేశంపేట మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం కేశంపేట ఎంపీపీ వర్కాల లక్ష్మమ్మ విద్యార్థులచే ప్రార్థన చేయించడమే ఇందుకు నిదర్శనం. మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించకపోవడంతో పాటు విధులకు గైర్హాజరు అవుతున్నారన్న ఫిర్యాదుల మేరకు ఎంపీపీ వర్కాల లక్ష్మమ్మ కేశంపేట మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9:20 నిముషాలు అయినా ఉపాధ్యాయులు ఎవరూ రాకపోవడంతో ఎంపీపీ లక్ష్మమ్మ విద్యార్థులచే ప్రార్థన చేయించారు. ఉపాధ్యాయులు దాదాపు అరగంట తర్వాత పాఠశాలకు వచ్చారు. టైర్ పంక్చర్ కావడం వల్ల ఆలస్యమైందని ఓ ఉపాధ్యాయురాలు తెలుపగా సిటీ నుంచి రావడానికి ఆలస్యమైందని హెచ్‌ఎం ఎంపీపీకి వివరించారు. అలాగే మండల కేంద్రంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించగా ఓ అంగన్‌వాడీ కేంద్రం తెరుచుకోలేదు. మరో కేంద్రంలో ఒక చిన్నారి మాత్రమే హాజరయ్యారు. ఎంపీపీ వెంట కోఆప్టెడ్ సభ్యుడు జమాల్‌ఖాన్, టీఆర్ఎస్ నాయకులు వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, మురళీధర్ రెడ్డి, నారాయణరెడ్డి, మల్లేష్‌యాదవ్ ఉన్నారు.

'విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి'


వినతిపత్రం అందజేస్తున్ననాయకులు

షాద్‌నగర్‌అర్బన్: సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినంగా ప్రభుత్వం ప్రకటించి అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ర్యాలీగా తరలివెళ్లి ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసెంబ్లీ ఇంచార్జి శేరి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న అధికారికంగా నిర్వహిస్తామని చెప్పినా, నేటికీ ఆచరణలో పెట్టడం లేదని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలన నుండి సర్దార్ వల్లభబాయ్ పటేల్ కృషి వల్లనే హైదరాబాద్‌ను దేశంలో విలీనం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం సెప్టెంబర్ 17న విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ ప్రచార కార్యదర్శి కక్కునూరి వెంకటేష్‌గుప్త, మండల పార్టీ అధ్యక్షుడు ఇస్నాతి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మల్చలం మురళీ, సీనియర్ నాయకులు నందిగామ వెంకటేష్, మల్లికార్జున్, శ్రీధర్‌రెడ్డి, సురేష్, వెంకటేష్, మార్కండేయులు, హన్మంతు, వంశీకృష్ణ, క్యామమహేష్, కిశోర్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన


బొడ్రాయికి అభిషేకం నిర్వహిస్తున్న మహిళలు

కేశంపేట: మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో శుక్రవారం అంగరంగ వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన అనంతరం మహిళలు తమ శిరస్సులపై నీటిని తెచ్చి అభిషేకం చేశారు. గురువారం రాత్రి బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేపట్టారు. బంధువుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. భక్తులకు అన్న వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ భీమమ్మ, ఉప సర్పంచ్ పద్మమ్మ, నాయకులు మురళీధర్, కృష్ణ, ఎ. రమేష్, జంగయ్య, రాఘవేందర్, అశోక్‌రెడ్డి, జగన్, భాస్కర్, వెంకటేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధర్మకర్తల మండలికి ఆహ్వానం

కేశంపేట: మండలంలోని కాకునూరు మహాలింగేశ్వర స్వామి ఆలయం, నిర్దవెల్లిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయం, వేముల్‌నర్వ వేణుగోపాలస్వామి ఆలయాలకు ధర్మకర్త మండలి ఏర్పాటుకు దేవాదాయశాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తుందని ఈవో నరేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 20 రోజులలో ఉప కమిషనర్ దేవాదాయ శాఖ హైదరాబాద్ వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆ బడికి అవ్వాల్సిందే..

ఫిదా

వికారాబాద్ అర్బన్: విద్యార్థులను ఆకట్టుకునే విధంగా బోధన చేయడంలో వికారాబాద్ మండలంలోని కొంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు తమదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. వినూత్న పోకడలతో విద్యా బోధన చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. పాఠశాల గోడలపై పాఠ్యాంశాలు, జనరల్‌నాలెడ్జ్, ఇతర ముఖ్యాంశాల బొమ్మలు, వివరాలు పెయింటింగ్ చేయించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేస్తూ కొంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. దాతల సహకారం తీసుకోవడంతో పాటు తమ పాఠశాల విద్యార్థుల కోసం తాము కూడా తమవంతు చేయూతను అందించేందుకు తమ సొండబ్బులు వెచ్చిస్తూ ఆ ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణను ఆహ్లాదకరంగా మార్చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు ఈ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యే విధంగా ఏర్పాట్లు చేసిన ఉపాధ్యాయులు అందరితో శభాష్ అని అనిపించుకుంటున్నారు. తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలతో పాటు అంకెలు, గుణింతాలు, ఒత్తులు, రాష్ట్రాలు, వాటి రాజధానులు, కార్టూన్ బొమ్మలు, కొత్తగా ఏర్పడిన జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్ర చిత్రపటం, భారతదేశ చిత్ర పటం, ఇంగ్లీష్ గ్రామర్, ఇంగ్లీష్ పదాలకు తెలుగు అర్థాలు, రాష్ట్ర చిహ్నాలు, మానవ శారీరంలో జీర్ణక్రియ, ఇతర అవయవాల పనితీరు ఇలా.. ఎన్నో రకాల పెయింటింగ్‌లను పాఠశాల ఆవరణలో వేయించారు. ఈ చిత్రాలను చూడగానే విద్యార్థులకు పాఠ్యాంశాలు పూర్తిగా అర్థమయ్యే విధంగా బొమ్మలను వేయించారు. పాఠశాలలో పెయింటింగ్ కోసం ప్రభుత్వం నిధులు ఇవ్వకపోయినా ఉపాధ్యాయులు దాతల సహకారాన్ని తీసుకున్నారు. అంతే కాకుండా తమ సొంత డబ్బులను కూడా పాఠశాల కోసం ఖర్చు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఊరెళ్ల విఠల్, ఉపాధ్యాయురాలు కరుణశ్రీ సొంతంగా డబ్బులు పోగు చేసుకుని పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దారు.

రూ.40 వేలు మంజూరు చేసిన కలెక్టర్

ఇదిలా ఉంటే, పాఠశాల అభివృద్ధికి కలెక్టర్ దివ్య సహకారం కూడా ఉంది. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కలెక్టర్ లక్షలాది నిధులు విడుదల చేశారు. అందులో భాగంగా కొంపల్లి పాఠశాలకు రూ.40 వేలు విడుదల చేశారు. అదేవిధంగా ఈ నిధులతో పాటు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలు కొన్ని డబ్బులు పోగు చేసుకోగా, మరికొంత డబ్బును దాతల నుంచి తీసుకుని పాఠశాలను బాగు చేసుకున్నారు.

పెయింటింగ్ వేసిన ఉపాధ్యాయురాలు కరుణ

విద్యార్థులకు అర్థమయ్యే తీరులో గోడలపై వేసిన పెయింటింగ్స్‌లో చాలా వరకు ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు కరుణశ్రీ వేసినవే కావడం విశేషం. ఇంగ్లీష్ పదాలు, అంకెలు.. బొమ్మలు, ఇలా గోడలపై వేయాల్సిన పెయింటింగ్‌ల గురించి ఆమె హెచ్‌ఎం విఠల్‌తో చర్చించారు. తానే తెల్ల చాక్‌పీస్‌తో గోడలపై ముందుగా స్కెచ్ వేశారు. కరుణశ్రీ వేసిన స్కెచ్‌లో పెయింటర్ రంగులు వేసి తుది మెరుగులు తీర్చిదిద్దారు. పాఠశాల ఆవరణలో ఏ వైపు చూసినా రంగులమయంగా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. ప్రైవేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోనట్లుగా కొంపల్లి ప్రాథమిక పాఠశాల కనిపిస్తోంది.

చదువుతో పాటు ఆటాపాటలు..

పాఠశాలకు వచ్చే విద్యార్థుల్లో ఎవరైనా గైర్హాజరైతే కారణమేమిటనేది తెలుసుకుంటున్నారు. అదేవిధంగా అనారోగ్యం, అత్యవసర కారణాలు కాకుండా కావాలనే పాఠశాలకు గైర్హాజరైనట్లు తెలిస్తే మాత్రం విద్యార్థుల ఇంటికి వెళ్లి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు వచ్చేలా కృషి చేస్తున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమయ్యేలా చేయడమే కాకుండా ఆట పాటల్లోనూ రాణించేలా కృషి చేస్తున్నారు.



కొంపల్లి ప్రాథమిక పాఠశాల

- కొంపల్లి ప్రాథమిక పాఠశాలలో వాల్ రైటింగ్, వాల్ టీచింగ్ బోధన
- విద్యార్థులను ఆకట్టుకునేలా విద్యాభ్యాసం
- తరగతి గోడలపై పాఠ్యాంశాల చిత్రాలు
- దాతల విరాళం, ఉపాధ్యాయుల కృషి
- అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తున్న కొంపల్లి ప్రాథమిక పాఠశాల





మధ్యాహ్న భోజనానికి ముందు ప్రార్థన చేస్తున్న విద్యార్థులు, పాఠశాల గోడపైన వేసిన వాల్ పెయింటింగ్



పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్



తరగతి గదిలో అందంగా వాల్ పెయింటింగ్

సులభంగా విద్యాబోధన..

కరుణశ్రీ, ఉపాధ్యాయురాలు కొంపల్లి



మా పాఠశాలను ప్రైవేట్ పాఠశాల కంటే బాగా నడిపించాలనేది మా లక్ష్యం. సులభంగా భోదిస్తున్నాం. మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫాం ప్రతి పిల్లవాడికి చేరాలి. మా వంతుగా కొంత డబ్బు పోగు చేసుకోవడమే కాకుండా, దాతల సహకారంతో మా పాఠశాలను అభివృద్ధి చేసుకుంటున్నాం.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలి

విఠల్, ప్రధానోపాధ్యాయులు




కలెక్టర్ గారు ఇచ్చిన నిధులతో పాఠశాలను అభివృద్ధి చేసుకున్నాం. పాఠశాల అభివృద్ధిలో కొంత దాతల సహాయం కూడా ఉంది. పాఠశాలలో బోరుతో పాటు మరుగుదొడ్లు నిర్మించుకున్నాం. మా పాఠశాల బాగుండాలి. మా వద్ద చదివే విద్యార్థులు బాగుపడాలన్నదే మా లక్ష్యం.

జీఎస్టీ అమలు అంతంతే..

కొడంగల్: జీఎస్టీ అమలుకు ముందు వ్యాట్ పరిధిలో దాదాపు 4,601 మంది డీలర్‌లుఉండగా వీరందరూ జీఎస్టీ పరిధిలోకి క్రమంగా వస్తున్నారు. 4,153 మంది వ్యాపారులకు యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారు. వీరందరూ కంప్యూటర్‌లను అమర్చుకొని ఆన్‌లైన్ ద్వారా బిల్లులను వినియోగదారులకు అందించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా బిల్లింగ్ చేస్తున్న వారు మాత్రం పరిమితంగానే ఉన్నారు. ఎందుకంటే సర్వర్‌డౌన్ కావడం, ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపుకు ఇబ్బందిగా ఉండటంతో జీఎస్టీతో బిల్లుల జారీ అత్యంత పరిమితంగానే ఉంది. డిజిటల్ సంతకాలకు 2,250 మంది దరఖాస్తులు చేయగా 1,360 మందికి డిజిటల్ సంతకాల అనుమతి రావాల్సి ఉంది. 2016-17లో జిల్లాలో వాణిజ్య పన్నుల ద్వారా రూ.16.07 కోట్ల ఆదాయం సమకూరగా గత ఏప్రిల్, మే, జూన్ మాసాల్లోనే రూ.6.22 కోట్ల ఆదాయం వ్యాట్, సీఎస్‌టీ ద్వారా సమకూరింది. వినోద పన్ను, వృత్తి పన్నుల ద్వారా లక్షల ఆదాయం వచ్చింది. గత సంవత్సరంతో పోల్చితే ఆదాయం గణనీయంగా పెరగగా జీఎస్టీ అమలుతో మరింతగా పెంపుదల ఉండోచ్చునని భావిస్తున్నారు. జీఎస్టీ లైసెన్స్ పొందిన వ్యాపారులంతా తమ క్రయవిక్రయాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 11 వేలకు పైగా దుకాణాలు, ఇతరాత్ర లావాదేవీలు జరుగుతుండగా వీరందరూ తప్పనిసరిగా జీఎస్టీ లైసెన్స్‌ను తీసుకొని ఆన్‌లైన్ ద్వారా వివరాలను నమోదు చేయడం, కంప్యూటర్ బిల్లింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ వేలాది దుకాణాల్లో కంప్యూటర్లే లేకపోగా ఇప్పటి వరకు కనీసం లైసెన్స్ నమోదుకు కూడ చర్యలు చేపట్టనందన వస్తు సేవల పన్ను అమలు అంతంతమాత్రంగానే ఉంది. నిత్యావసరం, అత్యవసరం, మౌలికం, వినియోగం, విలాసం తదితర కేటగిరీలుగా విభజించి నాలు స్లాబుల పన్నునే అమలు చేస్తున్నారు. పన్నులేని వస్తువులను మినహాయించి మిగతా వాటిల్లోని 1,207 రకాలను విభజించి కేటగిరీల వారీగా 5, 12, 18, 28 శాతంగా విభజించి పన్నులను వసూలు చేయాలి. కానీ నెల రోజులు గడుస్తున్నా ఏ వస్తువుల ధరలు పెరిగాయో, ఏవి తగ్గాయో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు లాగినై వివరాలను అప్‌లోడ్ చేసినప్పుడు వీరికి ఏఆర్ఎన్ నెంబర్ వస్తుంది. రెండు నెలల వరకు ఈ నెంబర్ ఆధారంగా లావాదేవీలను జరపవచ్చును. తర్వాత శాశ్వత జీఎస్టీ నెంబర్‌ను కేటాయించడం జరుగుతుంది. జిల్లా ప్రజలు వినియోగించే వాటిలో ప్రధానంగా ప్యాకింగ్‌లో లేనివే అధికంగా ఉండటంతో పన్నుల భారం అంతగా కనిపించడం లేదు. కూరగాయలు, ఆహార ధాన్యాలు, విద్యా సేవలు, వైద్య సేవలు, గాజులు, చేనేత వస్త్రాలు, తాజా మాంసం, చేపలు, చికెన్, బ్రెడ్, తేనె, గోధుమ, మైదా, శనగపిండి, పండ్లు, ఉప్పు తదితర వస్తువులపై ఎలాంటి పన్ను ఉండదు. 5 శాతం పన్ను పరిధిలోకి ప్యాకింగ్ చేసిన బియ్యం, పాలపొడి, పన్నీర్, వంటగ్యాస్, నూనెలు, మ్యాట్‌లు, కిరోసిన్, చక్కెర, ఔషధాలు, పిజ్జాబ్రెడ్, టీకాఫీ, మసాలాలు, జీడిపప్పు, చిన్న రెస్టారెంట్‌లు, రూ.500లోపు చెప్పులు, రూ.50లక్షల్లోపు టర్నోవర్, యంత్ర పరికరాలు, పాడిపరిశ్రమ, శీతలగృహాలు, టాక్సీసేవలు ఉన్నాయి. 12 శాతం పన్ను పరిధిలోకి పండ్ల రసాలు, ఆయుర్వేద మందులు, జామ్‌జెల్లీ, డ్రైఫ్రూట్స్, సైకిళ్లు, కుట్టు మిషన్లు, ఆట వస్తువులు, సెల్‌ఫోన్‌లు, పాల డబ్బాలు తదితరాలు ఉండగా 18 శాతం పన్ను పరిధిలోకి పురుగు మందులు, ఇన్‌స్టంట్‌ఫుడ్, ఎలక్ట్రానిక్ బొమ్మలు, కెమెరాలు, మానిటర్లు, స్పీకర్లు, హెల్మెట్‌లు, ఎలక్ట్రానిక్ స్టవ్‌లు, మినరల్ వాటర్, ఐస్ క్రీములు, కేకులు, స్టీలు సామాగ్రి ఉండనున్నాయి. 28 శాతం పన్ను పరిధిలోకి మోటార్ సైకిళ్లు, ఆటోమొబైల్, తయారైన బీడీలు, చాక్లెట్లు, పాన్‌మసాలా, శీతల పానీయాలు, రంగులు, హెయిర్‌డై, షాంపూ, షేవింగ్ క్రీమ్, వాటర్‌హీటర్, ఏటీఎం వస్తువులు ఉన్నాయి. అయితే ఆన్‌లైన్ బిల్లింగ్ లేకపోవడంతో బిల్లింగ్‌లో తేడా ఏ మాత్రం తెలియడం లేదు.

తేడా తెలియడం లేదు

- వెంకటయ్య, ఉప్పర్‌పల్లి



జీఎస్టీ పన్ను విధానం అమలై నెల రోజులు గడుస్తున్నా ఏ వస్తువుల ధరలు తగ్గాయో, ఏ వస్తువుల ధరలు పెరిగాయనే విషయం తెలియడం లేదు. ఏ దుకాణం లోనూ ఆన్‌లైన్ కంప్యూటర్ బిల్లింగ్ లేకపోవడంతో ధరల నిర్ణయం, పన్నుల వసూలు ఏదీ తెలియడం లేదు. ఆన్‌లైన్‌లో బిల్లులను అందిస్తే పన్నును ఎంత తీసుకున్నారనే దానిపై తెలిసేందుకు అవకాశం ఉంటుంది.

ప్రభావం కనిపిస్తుంది

- రమేశ్‌లాహోటి, వ్యాపారి, కొడంగల్



చాలా రకాల వస్తువులపై జీఎస్టీ పన్ను ప్రభావం కనిపిస్తుంది. కిరాణ సామగ్రి, కంపెనీల వస్తువులపై ఉత్పత్తి పన్నును విధించిన తర్వాతే పంపించడం జరుగుతుంది. కంప్యూటర్ బిల్లింగ్‌తో విక్రయిస్తే చాలా మంది ధరలు ఎక్కువగా ఉంటాయని సందేహిస్తారు. అన్ని చోట్ల కంప్యూటర్ బిల్లింగ్‌ను ఒకే సారి అమలు చేస్తే వినియోగదారులకు సౌకర్యంగా ఉంటుంది.

యువత.. దేశ భవిత..

దేశాభివృద్ధికి యువశక్తే ప్రధాన వనరు. ప్రజా సంక్షేమం కోసం ఉద్యమాలు చేపట్టాలన్నా, పోరాడి హక్కులు సాధించుకోవాలన్నా, అవినీతికి వ్యతిరేకంగా గళం విప్పాలన్నా, సమస్యల పరిష్కారానికి పిడికిలి బిగించాలన్నా, సమాజంలో మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలన్నా.....ఇవన్నీ ఒక్క యువతకే సాధ్యం. ప్రస్తుత సమాజ పరిస్థితుల్లో ప్రభుత్వాల పనితీరును సైతం యువత ప్రభావితం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. దేశ వ్యాప్తంగా జరిగిన అనేక సంఘటనలు దీనిని రుజువు చేశాయి కూడా. అందుకే సమ సమాజ నిర్మాణంలో యువత పోషిస్తున్న పాత్రను, యువత గొప్పతనాన్ని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడానికి ప్రతి ఏడాది ఆగస్టు 12న అంతర్జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం...

-వికారాబాద్ ఫీచర్స్:

- యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమే
- ప్రపంచ శాంతి-యువత అనే థీమ్‌తో ఈ సారి వేడుకలు
- నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం


మూఢనమ్మకాలపై భగత్ సింగ్ కల్చరల్ బృందం అవగాహన

ఈరోజునే ఎందుకంటే....

యువత బాధ్యతలు నిర్వహించే మంత్రుల ప్రపంచ సదస్సు చేసిన సిఫార్సు మేరకు 1999లో ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఆగస్టు 12వ తేదీని అంతర్జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటిస్తూ తీర్మానం చేసింది. ఇందులో భాగంగా ఈ రోజున వర్క్ షాపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశాలను నిర్వహించడం ద్వారా జాతీయ, స్థానిక ప్రభుత్వ అధికారులను, యువజన సంఘాలను భాగస్వామ్యులను చేయాలని సూచించింది. అంతే కాకుండా ప్రతీ ఏటా ఈ దినోత్సవాన్ని ఒక ప్రత్యేక థీమ్‌తో జరపాలని నిర్దేశించింది. ఐరాస సూచన మేరకు అన్ని దేశాలు సైతం ఈ సంప్రదాయాన్ని కొనసాగించాయి. ప్రస్తుతం 150కు పైగా దేశాల్లో ఏటా యువజన దిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ప్రపంచ శాంతి సాధనలో యువత పాత్ర అనే థీమ్‌తో వేడుకలను నిర్వహించాలని నిర్ణయించారు.


మొక్కలు నాటుతున్న ఎన్నారం కలర్స్ యూత్ సభ్యులు

యువతను ప్రోత్సహించేందుకు నెహ్రూ యువకేంద్రం..

దేశాభివృద్ధిలో యువత అవసరాన్ని, ప్రాముఖ్యతను గుర్తించిన ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేకంగా నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) అనే ఓ సంస్థను ఏర్పాటు చేసింది. ఎన్‌వైకే ప్రతి ఏటా పలు విడతలుగా యువత అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నది. ముఖ్యంగా యువతీ, యువకులకు ఆసక్తి గల రంగాల్లో సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నది. సమాజ సేవా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకునేలా చైతన్యవంతుల్ని చేస్తోంది. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించి ప్రతిభ గల వారికి ప్రోత్సాహకాలను అందిస్తోంది. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టే యువ జన సంఘాలకు ప్రత్యేకంగా అవార్డులు ఇవ్వడంతో పాటు రూ.25 వేల నగదు బహుమతిని అందిస్తోంది. ప్రభుత్వ పథకాల ప్రచారంతో పాటు ప్రజలను చైతన్య వంతం చేసే కార్యక్రమాల నిర్వహణ లోనూ ఉత్తమ సంఘాలుగా ఎంపికైన వారికి ప్రాతినిధ్యం కల్పిస్తోంది.

జిల్లాలో 180 యువజన సంఘాలు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 501 యువజన సంఘాలు ఉండగా వికారాబాద్ జిల్లాలో 180 వరకు వివిధ రకాల యువ జనసంఘాలు ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వ గుర్తింపు లేకున్నా సమాజ సేవ చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటూ గొప్ప పేరు సంపాదిస్తున్నాయి పలు యువజన సంఘాలు.

సమాజ సేవలో ముందుంటున్న యువత

జిల్లాకు చెందిన పలు మండలాల యువత సామాజిక, సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందంజలో ఉంటూ అందరి ప్రశంసలు పొందుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ యువత చిరస్మరణీయమైన పాత్రను పోషించింది. అలాంటి కొన్ని యువజన సంఘాలు చేపడుతున్న కార్యక్రమాలను ఓ సారి పరిశీలిస్తే.....

కలర్స్ యూత్, యెన్నారం....

కోట్‌పల్లి మండలం యెన్నారం గ్రామానికి చెందిన కలర్స్ యూత్, జన జాగృతి కళా బృందం సభ్యులు సామాజిక, సేవా కార్యక్రమాల నిర్వహణలో ముందున్నారు. గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, మురుగు కాలువలు శుభ్రం చేయడం, రోడ్లపై గుంతలను మట్టితో పూడ్చడం, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడం వంటి సామాజిక కార్యక్రమాలతో ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ గల విద్యార్థులకు చేయూతను అందిస్తున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు.

ఆదర్శం వివేకానంద యూత్...

సామాజిక, సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు కుల్కచర్ల మండల కేంద్రానికిచెందిన వివేకానంద యూత్ సభ్యులు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే వాటి పరిష్కారానికి నడుం బిగిస్తున్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు తరచూ శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతీయ పండుగలతో పాటు దేశ నాయకుల జన్మదిన వేడుకలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రజల్లో దేశభక్తిని పెంచే కార్యక్రమాలను చేపడుతున్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్నారు.

సామాజిక సేవలో నాగసమందర్ ఎన్‌వైకే సభ్యులు...

నాగసముందర్ గ్రామానికి చెందిన ఎన్‌వైకే సభ్యులు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతూ మన్ననలు పొందుతున్నారు. తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం, వీధుల్లో చెత్తా, చెదారాన్ని ఏరివేయడం, రోగాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించడం వంటి పనులు నిర్వహిస్తున్నారు. వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు తగు చర్యలు చేపట్టారు. వాటిని శుభ్రం చేసి తాగునీటి సౌకర్యం కల్పించారు.

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య...

తెలంగాణ ఉద్యమంలో జిల్లాకు చెందిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు కీలకపాత్ర పోషించారు. తమ నృత్య ప్రదర్శన, జానపద గేయాలు, తెలంగాణ ఆట, పాటలతో ఈ ప్రాంతంలో ఉద్యమానికి ఊపు తెచ్చారు. ఇందులో సభ్యులుగా ఉన్న దోమ, కుల్కచర్ల, పరిగి మండలాల యువకులు బృందంలో పని చేస్తూ ఉద్యమ సమయంలో జైలుకు కూడా వెళ్లారు.

మూఢనమ్మకాల నిర్మూలనే ధ్యేయం....

జిల్లాకు చెందిన భగత్ సింగ్ కల్చరల్ అకాడమీ సభ్యులు మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. ముఖ్యంగా మద్యపానం వల్ల కలిగే అనర్థాలపై జిల్లాలో అనేక చోట్ల ప్రదర్శనలు ఇచ్చారు. మన రాష్ట్రంలోనే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలోనూ శంకర్ అనే యువకుడి నాయకత్వంలోని ఈ కళా బృందం సభ్యులు విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌వైకే ఆధ్వర్యంలో నిర్వహించిన పలు రాష్ట్ర, జాతీయ స్థాయి సాంస్కృతిక పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటారు.

ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే మరిన్ని కార్యక్రమాలు...



యువజన సంఘం ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వంతో పాటు అధికారులు సహకరిస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్దంగా ఉన్నాం. ముఖ్యంగా మొక్కల సంరక్షణ చేపట్టాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలపడానికి విశేష కృషి చేస్తున్నాం. అందుకే హరితహారంలో మేము కూడా భాగమై పెద్ద ఎత్తున మొక్కలు నాటాం.

-దేవయ్య, కలర్స్ యూత్ అధ్యక్షుడు

యువత తలచుకుంటే ఏదైనా సాధ్యమే..



ఈ ప్రపంచంలో యువత తలచుకుంటే సాధించలేనది అంటూ ఏదీ ఉండదు. కానీ వారికి తగినంత అండ అవసరం. ఎందుకంటే సమాజ సేవ ఎంతగా చేయాలని ఉన్నా వారి ఆర్థిక పరిస్థితి సహకరించకపోవచ్చు. కాబట్టి కష్టపడే లక్షణం ఉన్న యువజన సంఘాలను ప్రభుత్వం చేయూతనివ్వాలి. అదే సమయంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు చూపించాలి.

- సుధాకర్‌రెడ్డి, వివేకానంద యూత్, ఎన్కెతల

రయ్..రయ్.. బుల్లెట్

- బుల్లెట్ వాహనాలపై యువతకు పెరుగుతున్న ఆసక్తి
- ధర ఎక్కువైనా వాటిపైనే మొగ్గుచూపుతున్న టీనేజ్

అనంతగిరి : సాధారణంగా కుర్రకారుకు ద్విచక్ర వాహనాలంటే విపరీతమైన మోజు. ఎవరి తాహతకు తగ్గ వారు చిన్న పాటి ద్విచక్రవాహనాల నుంచి భారీ ద్విచక్ర వాహనాల వరకు కొనుగోలు చేసి రై రై మంటూ రోడ్లపైకి ధూసుకు పోతుంటారు. కొంతమందికి చప్పుడు ఎక్కువ చేసే ద్విచక్ర వాహనాలు ఇష్టమైతే మరికొందరికి చూసేందుకు ఆకర్శనీయంగా ఉండే ద్విచక్రవాహనాలు ఇష్ట పడుతుంటారు. గతంలో బుల్లెట్ ద్విచక్ర వాహనాలు పోలీసుల వద్ద కనిపించేవి. గ్రామాల్లోకి బుల్లెట్ చప్పు డు వినిపిస్తే పోలీసులు వచ్చారనే భావించేవారు గ్రామస్థులు. తరువాతి కాలంలో బుల్లెట్ ద్విచక్రవాహనాలు సాధా రణ వ్యక్తులు సైతం కొనుగోలు చేసి వాడటం ప్రారంభించారు. ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంతాల్లో బుల్లెట్ వాహనాలపై యువతకు మోజు పెరుగుతంది. సాధారణ వాహనాలతో పోలిస్తే ధర మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది. అవి ఇచ్చే మైలేజ్ సైతం సాధారణ ద్విచక్ర వాహనాల కంటే చాల తక్కువగా మైలేజ్‌ను ఇస్తాయి. ఒక బుల్లెట్ ఖరీదులో సాధారణ కారును కొనుగోలు చేయవచ్చు. అయినా బుల్లెట్‌కు ఉంటే ప్రత్యేక హుందాతనంతో వాటిపై తిరిగేందుకే యువకులు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ బుల్లెట్‌లలో ప్రారంభ ధర రూ.1.30 లక్షల నుంచి రూ.2 లక్షలు ఆపైనే షోరూం ధరలు ఉన్నాయి.

అనంతగిరిలో బుల్లెట్ వాహనాల సందడి

శని, ఆదివారాలు వస్తే చాలు అనంతగిరి పర్యాటక కేంద్రానికి వందల సంఖ్యలో బుల్లెట్ వాహనాలతో సేదతీరేందుకు యువతు అనంతగిరికి వస్తుంటారు. ఎక్కువగా హైదరాబాద్ ప్రాంతం నుంచి గుంపులుగుంపులుగా బుల్లెట్ ద్విచక్ర వాహనాలతో వస్తుంటారు. ఇక్కడి నుం డి కోట్‌పల్లి తదితర ప్రాంతాలకు వెల్లి సేదదీరుతుంటారు. ఇందులో బుల్లెటరర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే వీకెండ్ ఈ వెంట్‌లో ఎక్కువగా అనంతగిరికి వస్తుంటారు. ఈ క్లబ్ గత దశాబ్దానికి పైగానే నడుస్తుంది. ఇందులో బుల్లెట్ వాహనం ఉన్న వారు రిజిస్టర్ చేసుకుంటే క్లబ్ నుంచి నిర్వహించే ఈవెంట్లలో పాల్గొనేందుకు వీలుంటుంది.

బుల్లెట్‌పై ప్రయాణిస్తే ఆలసట తెలియదు



బుల్లెట్ వాహనాన్ని తాను గత ఎనిమిది సంవత్సరాలుగా వాడుతున్నాను. ఈ వాహనంపై ఎంతదూరం ప్రయాణించినా అలసట రాదు. పెట్రోల్ మైలేజ్ సాధారణ ద్విచక్ర వాహనంతో పోల్చితే చాల తక్కువ మైలేజ్ ఇస్తుంది. ఈ బుల్లెట్ వాహనాన్ని నడిపేందుకు అలావాటు పడ్డాక ఇతర వాహనాలు నడిపేందుకు ఆసక్తి ఉండదు. ఎలాంటి దారుల్లోనైనా సునాయాసంగా ఈ వాహనంపై వెల్లవచ్చు.

- బద్ధం మహిపాల్‌రెడ్డి, బీజేవైఎం, జాతీయ కార్యదర్శి

అందరిలో ప్రత్యేకంగా కనిపిస్తాం...



తాను రాయల్ ఎన్‌ఫిల్డ్ కొనుగోలు చేశాను. దీనిపై కళాశాలకు వెల్లడం నాకు ఇష్టం, అందరిలో ఒకరిగా కాకుండా ప్రత్యేకంగా కనిపిస్తాం. దూర ప్రయాణం చేసినా పెద్దగా అలసట అనిపించదు. ప్రస్తుతం యువకుల్లో ఎక్కువగా ఈ బుల్లెట్ వాహనాలపై ఆసక్తి పెరుగుతుంది. ఒకప్పుడు నగరాల్లోనే కనిపించేవి. ప్రస్తుతం వికారాబాద్ పట్టణం లాంటి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

- రవితేజ, వికారాబాద్

1976 మే 25 ఏ వారం అవుతుంది?



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

మెంటల్ ఎబిలిటి

1. 200 కిమీ పొడవైన రహదారిపై రెండు కార్లు చెరోవైపు నుంచి ప్రయాణిస్తున్నాయి. మొదటి కారు 40 కిమీ ప్రయాణించిన తరవాత కుడివైపునకు తిరిగి 20 కిమీ ప్రయాణించింది. మరల ఎడమవైపునకు తిరిగి 35 కిమీ ప్రయాణించింది. తదుపరి ఎడమవైపునకు తిరిగి మెయిన్ రోడ్డుకు చేరుకొంది. రెండో కారు చిన్న లోపంతో కేవలం 55 కిమీ మాత్రమే ప్రయాణించింది. అయితే ప్రస్తుతం ఆ రెండు కార్ల మధ్య దూరం ఎంత?
ఎ) 60 కిమీ బి) 80 కిమీ సి) 75 కిమీ డి) 70 కిమీ

2. 6842109357 సంఖ్యలో మొదటి అంకెను రెండో స్థానంలోకి, రెండో అంకెను మొదటి స్థానంలోకి, మూడో అంకెను నాలుగో స్థానంలోకి, నాలుగో అంకెను మూడో స్థానంలోకి ఇలా అన్ని అంకెలు మారగా ఏర్పడిన కొత్త సంఖ్యలో ఎడమ నుంచి అయిదో అంకెకు గల మూడో కుడి అంకె?
ఎ) 9 బి) 5 సి) 3 డి) 4

3. కింది సంఖ్యలను ముందుగా వ్యతిరేక దిశలో రాసి తరవాత ఆ సంఖ్యలను అవరోహణ క్రమంలో రాస్తే మధ్య సంఖ్య మధ్య అంకె?
853, 942, 687, 439, 924, 168, 316
ఎ) 8 బి) 2 సి) 1 డి) 4

4. 80 మంది విద్యార్థులు ఉన్న ఒక వరసలో కిరణ్ ఎడమ నుంచి 32వ స్థానంలోను, తరుణ్ కుడి నుంచి 28వ స్థానంలోను ఉన్నారు. అయితే ప్రస్తుతం వారిద్దరి మధ్య గల విద్యార్థుల సంఖ్య?
ఎ) 20 బి) 40 సి) 28 డి) 26

5. ఒక వరసలో అచ్యుత్ ఎడమ నుంచి పదో స్థానంలోను, కుడి నుంచి ఆరో స్థానంలోను ఉన్నాడు. ఆ వరసలో మొత్తం సభ్యుల సంఖ్య 34 ఉండాలంటే ఎంతమంది వ్యక్తులు అవసరం?
ఎ) 12 బి) 19 సి) 21 డి) 18

6. వివేక్‌కు అతని సోదరి పుట్టిన రోజు ఆగస్టు 20, 25 మధ్య అని గుర్తు. అతని తండ్రికి తమ కుమార్తె పుట్టిన రోజు సెప్టెంబరు 23, 28 మధ్య అని గుర్తు అయితే వివేక్ సోదరి పుట్టిన రోజు ఎప్పుడు?
ఎ) ఆగస్టు 24 బి) సెప్టెంబరు 24
సి) చెప్పలేం డి) ఏదీకాదు

7. పాట్నాకు ఒక రైలు ప్రతి 80 నిలకు ఉంది. విచారణాధికారి తనను కలిసిన ప్రయాణి కుడితో రైలు వెళ్లిపోయి 15నిలు అయింది. తరవాతి రైలు గం.10.15నిలకు అని చెప్పాడు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పాడు?
ఎ) గం. 9.10 ని. బి) గం. 10.20 ని.
సి) గం. 9.30 ని. డి) ఏదీకాదు


8. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల సరి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 8 6 5 9 2 3 6 8 4 2 7 9 2 8 3 9
ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) ఏమీ లేవు

9. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి

8	5	961
7	8	522
9	3	?

ఎ) 843 బి) 441 సి) 924 డి) 462

10. ప్రశ్నార్థకం గుర్తు గల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి



ఎ) 65 బి) 92 సి) 48 డి) 64

11. ఒక అంకె 3 కన్నా పెద్దది 7 కన్నా చిన్నది. అదే అంకె 5 కన్నా పెద్దది, 9 కన్నా చిన్నది. అయితే ఆ అంకె?
ఎ) 8 బి) 4 సి) 6 డి) 9

12. 1976 మే 25 ఏ వారం అవుతుంది?
ఎ) గురువారం బి) మంగళవారం
సి) బుధవారం డి) సోమవారం

13. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య, తరవాత బేసి సంఖ్య గల బేసి సంఖ్యలు ఎన్ని ఉన్నాయి?
8 4 3 9 2 5 6 8 5 2 7 3 4 6 8 7 9 2 1 4 8 9 3
ఎ) నాలుగు బి) మూడు సి) రెండు డి) ఏమీలేవు

14. ఇంటర్వ్యూ నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ గం. 11.00 కంటే 15 ని.లు ముందుగా వచ్చారు. ఈయన చైర్మన్ కంటే 25ని.లు ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 20 నిలు ముందు వచ్చారు. అయితే ఇంటర్వ్యూని ఎప్పుడు నిర్వహించాలనుకొన్నారు?
ఎ) గం. 11.00 ని. బి) గం. 11.30 ని.
సి) గం. 11.15 ని. డి) ఏదీకాదు

15. కింది పదాలను నిఘంటువు ప్రకారం అమర్చిన తరవాత మధ్యలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Mobile 2. Master 3. Manner
4. Market 5. Minister
ఎ) Master బి) Minister
సి) Market డి) Mobile

16. అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం కుడి నుంచి 12వ అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరం?
ఎ) P బి) R సి) Q డి) J

17. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను సవ్య దిశలో రాసి రెండో సగం అక్షరాలను అపసవ్య దిశలో రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల అయిదో కుడి అక్షరం?
ఎ) Z బి) Y సి) X డి) W

18. సవ్యదిశ వర్ణమాలలో కుడి ఆరో అక్షరం నుంచి పది అక్షరాలను అపసవ్యదిశలో రాసి మిగిలిన అక్షరాలను యథాతథంగా రాశారు. దీని ప్రకారం ఎడమ నుంచి పదో అక్షరానికి గల నాలుగో కుడి అక్షరం?
ఎ) U బి) R సి) T డి) S

19. 1956 ఆగస్టు 2న ఏవారమవుతుంది?
ఎ) శుక్రవారం బి) శనివారం
సి) గురువారం డి) బుధవారం

20. ఈ రోజు ఆగస్టు 19 గురువారం. ఇది లీపు సంవత్సరమయితే మూడేళ్ల క్రితం ఇదే తేదీకి ఏ వారం వస్తుంది?
ఎ) ఆదివారం బి) శనివారం
సి) సోమవారం డి) బుధవారం

21. 2001 జనవరి 1 శుక్రవారం అయితే తదుపరి వచ్చే ఏ సంవత్సరంలో జనవరి 1 శుక్రవారమవుతుంది?
ఎ) 2001 బి) 2007 సి) 2008 డి) ఏదీకాదు

